కథ 2005

6



# కింద నేల ఉంది

మహమ్మద్ ఖదీర్‌బాబు

ఇంతకు మునుపే ఆమె, హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి చిన్న బాటిల్ తీసి, కళ్లలో డ్రాప్స్ వేసుకుంది. ఇప్పుడామె ఏడుస్తున్నదా ఏడ్వడానికి సిద్ధంగా ఉన్నదా మామూలుగా ఉన్నదా అర్థం చేసుకోవడం కష్టంగా ఉంది.

నిజమైనవో, కృత్రిమమైనవో తెలియని నీటిపొరలతో ఆమె కళ్లు నన్నూ, అయ్యప్పనూ మార్చి మార్చి చూశాయి.

అయ్యప్ప ఏదో తప్పు చేసినవాడిలా కొంచెం ఒంగి నిలబడి, "అది కాదండీ! మాదసలే సినిమా ఫీల్డు. ఏ రోజున ఏ రికార్డింగ్ థియేటర్‌లో ఉంటామో తెలియదు. టైమింగ్స్ ఉండవు. ఒక్కోసారి ఓవర్ కాల్షీట్లు పడతాయి. బయటి ప్రోగ్రాములు కూడా ఉంటాయి. మీ అబ్బాయికి నేర్పాలంటే నేను ఒక రోజుకో, ఒక టైముకో ఫిక్స్ కావాలి. ఏ విధంగా చూసినా అది మ్యాచ్ కాదు. ఇఫ్ యు డోన్ట్ మైండ్ ఇంకెవరైనా ఉన్నారేమో చూడమంటారా? పెద్ద ప్రాబ్లమ్ కాదు. చాలా ఈజీగా దొరుకుతారు," అన్నాడు.

ఆమె ఒక  నిమిషంపాటు ఏమీ మాట్లాడలేదు. ఏదో ఎక్సర్‌సైజ్ చేస్తున్నదానిలా కనుగుడ్లను గుండ్రంగా తిప్పుతూ కళ్లల్లో ఉన్న నీటిని జాగ్రత్తగా మూలలకు సర్దుకుంటూ ఉండిపోయింది.

ఆ తర్వాత మావంకే చూస్తూ చాలాసేపటికి మర్యాదపూర్వకంగా నవ్వింది.

"పర్వాలేదులెండి. ఏం చేస్తాం. మీ ఇబ్బంది మీరు చెప్పారు. ఇక మా ప్రాప్తం మేమనుకోవాలి," అని, పక్కనే ఉన్న వాళ్ల అబ్బాయితో, "చిన్నూ, వెళ్దామా నాన్నా," అంది.

అప్పటివరకూ మా మాటలను పట్టించుకోకుండా, కళ్లెత్తి పరిసరాలను కూడా పరికించకుండా తన మానాన తాను సెల్‌ఫోన్‌తో ఆడుకుంటున్న చిన్నూ ఆమె వంక చూసి తల ఊపాడు. అతని ఒడిలో పసుపు రంగు శాటిన్ క్లాత్‌లో చుట్టిన ఒక కొత్త కీబోర్డ్ ఉంది. చాలాసేపుగా అది అతడి వైఖరికి తగినట్టుగా నిర్లక్ష్యంగా జారుడుగా వాలి ఉంది.

వాళ్లిద్దరూ లేచారు. నేనూ లేచాను.

అయ్యప్ప మమ్మల్ని కారుదాకా సాగనంపడానికి రోడ్డు మీదకు వచ్చాడు.

జనవరి నెల. చలికాలం.

అకాల వర్షపు ముసురుతో ఏడింటికే ఏ తొమ్మిదో పదో అయినట్టుగా చీకటి. చలి. ఊపుగా చలి.

జూబ్లీహిల్స్‌లో బేంబూ పార్క్ దాపున ఉన్నాం.

ఆమె వీపు నిండా పవిట కప్పుకుంటూ శబ్దమయ్యేలా పెద్ద పెద్ద అంగలేస్తూ  వెళ్లి డ్రైవింగ్ సీట్లో కూర్చుంది. చిన్నూ ఆమె పక్కన కూర్చోకుండా వచ్చి వెనుక సీట్లో ఎక్కాడు.

ఆమె అలా ముందు నడుపుతుండగా వెనుక కూర్చోవడం మర్యాద కాదు.

కానీ తప్పలేదు. నేనూ అతని పక్కనే ఎక్కబోతూ అయ్యప్పకు షేక్‌హ్యాండ్ ఇచ్చాను.

"సారీరా! నీకు ట్రబుల్ ఇచ్చినట్టున్నాను. ఈవిడ మాకు బాగా తెలిసిన డాక్టరు. ఒకటే ఇదిగా అడుగుతుండేసరికి," అన్నాను.

వాడు నా చేయి గట్టిగా నొక్కుతూ, "అదేం లేదు. నేనే నిన్ను డిజప్పాయింట్ చేశాను. ఏమనుకోవద్దు," అన్నాడు.

కారు కదిలింది.

చల్లగాలి లోపలికి రానీకుండా అద్దాలన్నీ బిగించాక ఆమె రెండు మూడు కాసెట్లు కెలికి ఒకటి ఏరి ఊరట కోసం అన్నట్టుగా పాటలు పెట్టుకుంది. చిన్నూ కీబోర్డును సీటు వెనుక పడేసి పై జేబులో నుంచి సెల్ ఫోన్ తీసి మిణుగురుల్లా మెరుస్తున్న మీటల్ని నొక్కుతూ మళ్లీ వాటిలో మునిగిపోయాడు.

ఏంచేయాలో తోచక అతనివైపే చూస్తూ కూర్చున్నాను.

వాస్తవానికి ఇప్పటివరకూ నేను అతనితో మాట్లాడింది ఏమీలేదు. అతను కూడా నన్ను పెద్దగా పలకరించిందీ లేదు. మామూలుగా పది పన్నెండేళ్ల వయసున్న పిల్లలు కనిపిస్తే వాళ్లతో కబుర్లు చెప్పకుండా ఉండటం చాలా కష్టమైన పని నాకు. ఇతనికి పన్నెండు ఉండొచ్చు. కాని వేరేగా ఉన్నాడు. ఆ వయసుకే చాలా పెద్దరికంతో కనిపిస్తున్నాడు- చనువు తీసుకొని ముట్టుకోవాలన్నా భయంగా అనిపించేంత.

''నన్ను మా ఆఫీసు దగ్గర దింపుతారా? నా బైక్ అక్కడే ఉంది,'' అన్నాను ఆమెతో.

కాని ఆమె నా మాటలు విననట్టుగా కారును చెక్‌పోస్ట్ నుంచి ఫిల్మ్‌నగర్ వైపు తిప్పింది. అక్కణ్ణుంచి లోటస్ పాండ్ వైపుకు మళ్లించి కబుర్లు చెప్పే వాలకంతో డ్రైవింగ్‌ని బాగా స్లో చేసింది. ఆ స్పీడులో ఆ రూటు నుంచి చుట్టూ తిరిగి మా ఆఫీసుకు చేరాలంటే చాలా టైము.

మొహమాటానికి పోయి లేనిపోని ఇరకాటంలో పడ్డానా అనుకున్నాను.

నెలక్రితం వరకూ ఆమె ముక్కూమొహం కూడా నాకు తెలియదు. నా భార్యకు చిన్న చెకప్ అవసరమైతే ఒక పెద్ద హాస్పిటల్‌కు వెళ్లాం. అక్కడ ఆమె గైనకాలజిస్ట్‌గా పనిచేస్తోంది. కళ్లతో చూసి చేతులతో మందులు రాసిచ్చే డాక్టర్లలా కాకుండా ఓపిగ్గా, నవ్వుతూ మాతో మాట్లాడింది. నా భార్యకు ఉన్న సంశయం పోగొట్టింది. ఆ తర్వాత మాటల్లో నా వివరాలు కూడా తెలుసుకుంది.

అయితే వాటిని పొడిగించలేదు. మరుసటిరోజు ఆఫీసుకు ఫోను.

''నేనండీ, డాక్టర్ లక్ష్మిని,'' అంది గబగబా నవ్వుతూ.

ఆ తర్వాత ఏదో చెప్పడానికి ఉద్వేగపడుతున్న దానిలా ఆగి, ''నిన్న ఇమ్మీడియట్‌గా ఎలా రెస్పాండ్ కావాలో తెలియలేదండీ. హాస్పిటలు. బయట పేషంట్లు వెయిట్ చేస్తున్నారు. ఒక రకంగా మీ ఆవిడ ఎదుట నేరుగా చెప్పడం కూడా కొంచెం సిగ్గనిపించిందనుకోండి. సంగతేమిటంటే నేను మీ డైహార్డ్ ఫాన్‌ని. నవ్వకండి. నిజం. చాలారోజులుగా మిమ్మల్ని ఒక్కసారన్నా కలవాలనుకున్నాను. అలాంటిది మీరే ఇన్సిడెంటల్‌గా నా దగ్గరకు రావడం... ఐ వజ్ థ్రిల్డ్,'' అని, ఆమెకామే మురిసిపోతూ నా కథలను నాకే గుర్తు చేస్తూ చాలాసేపు మాట్లాడి పెట్టేసింది.

ఆ తర్వాత మరో రెండు మూడుసార్లు చేసింది. నెమ్మదిగా ఆమెకు సంబంధించిన వివరాలు ఒకటి రెండు తెలిశాయి.

ఆమెది మా ప్రాంతమే. నెల్లూరు జిల్లా. వాళ్లది వేరే టౌను. ఆ ప్రాంతీయాభిమానం కొంత ఎక్కువగా పనిచేస్తున్నదా అనిపించింది కానీ అంతకు మించిన అవసరమేదో నాతో ఉన్నట్టుగా కూడా అర్థమైంది.

''మా బాబుకి మంచి మ్యూజిక్ టీచర్ కావాలండీ. పత్రికల్లో పనిచేస్తున్నారు కదా... ఇలాంటివి మీకు తెలుస్తుంటాయేమోనని. మీక్కూడా మ్యూజిక్కంటే ఇంట్రెస్టేనని తెలుసు. చిన్నప్పుడు స్కూల్లో పెద్ద పోజుగా పాడానని రాసుకున్నారుగా,'' అందామె నా కథ ఒకటి గుర్తుచేసి కిసుక్కుమని నవ్వుతూ.

''మావాడు నలుగురిలో కలిసే రకం కాదండీ. స్పెషల్ ఇంట్రెస్ట్ తీసుకొని ఇంటికొచ్చి చెప్పేవాళ్లుంటే చూడండి. వాళ్ల ఇంటికి మనం వెళ్లే పద్ధతైనా ఫర్వాలేదు. ఇప్పటికే చాలా ఆలస్యం చేశాను. ప్లీజ్... అర్జెంట్,'' అంది మళ్లీ.

ఆమె ఫోన్ పెట్టేసిన వెంటనే ఆ సంగతి మర్చిపోయాను.

మళ్లీ చేసింది.

''ఓకల్ వద్దండి. వాడసలు మాట్లాడటమే తగ్గించేస్తే ఇంక పాడటానికి నోరేం తెరుస్తాడు. ఇన్‌స్ట్రుమెంటల్ అయితే బెటర్. ఫ్లూట్, గిటార్, డ్రమ్స్, కీబోర్డ్... కీబోర్డ్ అయితే బాగుంటుంది కదా! పిల్లలకు ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది,'' అంది.

నేను మాట్లాడకుండా పెట్టేశాను.

ఇలాంటివాళ్లు కొంతమంది నాకు తెలుసు. డబ్బులున్నాయి కదా అని పిల్లల్ని పెయింటింగ్‌లోనో, డాన్సులోనో, మ్యూజిక్‌లోనో కోర్సుల లెక్కన చేర్పించడం, ఆ తర్వాత వాళ్లని అక్కడా ఇక్కడా స్టేజీలెక్కించి ఫోటోలు తీయడం, పత్రికల్లో ఏమైనా అచ్చయితే ఆ క్లిప్పింగులన్నీ నీటుగా స్పైరల్ బైండింగ్ చేయించి ఇంటికొచ్చిన వాళ్లను డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి డిస్‌ప్లే చేయడం...

ఆమె వదల్లేదు. ఇవాళ ఇంకోసారి చేసింది.

మరీ బతిమిలాడించుకుంటే బాగుండదని మాటవరసకి అయ్యప్ప ప్రస్తావన తెచ్చాను.

''మా ఫ్రెండ్ అయ్యప్ప అని ఉన్నాడండీ. ఈమధ్యనే మెడ్రాస్ నుంచి షిఫ్ట్ అయ్యాడు. మంచి కీబోర్డ్ ప్లేయర్. వాడేమైనా టీచ్ చేస్తాడేమో మాట్లాడి కనుక్కుంటాను,'' అన్నాను.

అది తప్పయిపోయింది. ఆవిడ ఆ మాటలను మరీ అతిగా తీసుకొని, ఆ వెంటనే హడావుడిగా ఒక కాస్ట్‌లీ కీబోర్డు కొనుక్కుని, కొడుకును కూడా వెంట పెట్టేసుకొని, హాస్పిటలు ఎగ్గొట్టేసి, చెప్పాపెట్టకుండా సరాసరి సాయంత్రానికంతా మా ఆఫీసుకు వచ్చేసింది. ఇక అయ్యప్ప దగ్గరకు వెళ్లేదాకా వదల్లేదు. ప్రాణాలు తోడినంత పనిచేసింది.

తీరా ఇప్పుడు వాడు కాదన్నాడు.

దీని నుంచి ఎలా బయటపడటమా అని నేను ఆలోచిస్తున్నాను.

కారు లోటస్‌పాండ్ దాటి అప్ ఎక్కేసరికి సన్నగా తుంపర మొదలయ్యింది. నియాన్ లైట్ల వెలుగులో ఎడం ఎడంగా కనిపిస్తున్న చినుకులు కాసేపటికి నెమ్మదిగా బలపడి జల్లుగా మారాయి. ఇంకాసేపటికి వాన.

ఆమె ఉన్నట్టుండి పాటల వాల్యూమ్ తగ్గించి, మెడను కొంచెం వెనక్కు తిప్పుతూ, ''చిన్నూ, ఆకలిగా ఉందా నాన్నా? ఏమైనా తింటావా? బిస్కెట్లున్నాయ్,'' అంది ఇంగ్లీషులో.

చిన్నూ ఏమాత్రం తల ఎత్తకుండా, సెల్ పై నుంచి చూపు కదపకుండా, ''వద్దు,'' అన్నాడు ఇంగ్లీషులో.

ఆమె ఇంగ్లీష్‌లోనే కొనసాగించింది. అతడు ఇంగ్లీష్‌లోనే జవాబులు చెబుతున్నాడు.

''వానను చూడుకన్నా... బయట ఎంత బాగుందో చూడు.''

''చూడను.''

''అద్దం కిందకు దించి, కావాలంటే దోసిళ్లలో చినుకులని పట్టవోయ్ భలే బాగుంటుంది.''

''కనపడట్లేదా... నా చేతుల్లో సెల్ ఉంది.''

''కన్నా! చెప్తే వినాలి. కనీసం వాన సౌండ్ వినరా. కీబోర్డ్‌లో రెయిన్ ఎఫెక్ట్ ఉంటుంది. ఇంటికెళ్లాక నువ్వు ట్రై చేయొచ్చు.''

''మమ్మీ...''

''సరే, సరే.''

ఆమె మ్యూజిక్ ఆఫ్ చేసి వైపర్స్ ఆన్ చేస్తూ నాతో మాట్లాడింది.

''చూడండీ! ఇది మీరు స్టయిలని అనుకోకండి. మావాడికి చిన్నచిన్న పదాలు, చిట్టిపొట్టి వాక్యాలు తప్ప తెలుగు అసలు రాదు. ఇంట్లోనూ, స్కూల్లోనూ ఇంగ్లీషే మాట్లాడి మాట్లాడి ఆఖరుకు వాడికి తెలుగు లేకుండా చేశాం,'' అంది.

కాసేపటికి పెదవి విరుస్తూ మళ్లీ అందుకుంది.

''ఇప్పుడు నాకు అర్థమవుతోందండీ అది ఎంత పెద్ద తప్పో. తల్లి కడుపులో ఉండగా విన్న భాషకు బిడ్డను దూరం చేయడం ఎంత అన్యాయమో. కానీ ఏం లాభం? జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు వాణ్ణి నేర్చుకోరా అన్నా నేర్చుకోవడం లేదు. నేర్చుకున్నా వాడి సర్కిల్‌లో మాట్లాడేవాళ్లు లేరు. మీరు నమ్మరు. అప్పుడప్పుడు చాలా ఆశగా అనిపిస్తుంటుంది... వాడికి తెలుగు వచ్చి ఉంటే బాగుండేది కదా... అప్పుడు నేను వాడికి మంచి మంచి తెలుగు పాటలు వినిపించి ఉండే దాన్ని కదా... గొప్ప గొప్ప తెలుగు కీర్తనల టేస్ట్ తెలియజేసుండేదాన్ని కదా... అవి వినైనా వాడొక చక్కటి సంగీత కళాకారుడు అయిపోతే బాగుణ్ణు కదా... కలలు...''

ఆమె మాట్లాడుతూనే ఉంది. నేను బయటకు చూస్తూ కూర్చున్నాను.

బయట వాన తెరలు తెరలుగా కురుస్తోంది.

పై నుంచి చినుకులు జోరుగా వచ్చి రోడ్డు మీద పడి చిట్లిపోతూ ఉన్నాయి. వస్తూపోతూ ఉన్న వాహనాల లైట్లు ఫ్లాష్ అయినప్పుడల్లా అవి చిట్లుతున్న చోట ఒక వింత తెలుపు కనిపిస్తూ ఉంది.

ఎందుకనో నాకు అయ్యప్ప గుర్తుకు వచ్చాడు. ఇంటర్ చదివేరోజుల్లో వాడి దగ్గర ఉన్న కీబోర్డు గుర్తుకు వచ్చింది. ఇలాగే వాన కురుస్తున్న సాయంత్రాల్లో వాళ్ల ఇంటి వరండాలో కూర్చుని వాడు ప్లే చేసి వినిపించిన పాటలూ గుర్తుకొచ్చాయి.

''అయ్యప్పకు సంగీతం ఎలా వచ్చిందో చెప్పనా అండీ!'' అన్నాను ఆమెతో.

నిజానికి ఆ సంగతి ఆమెకు చెప్పడం నాకు ఇష్టంలేదు. కాని తన్నుకొని వస్తోంది.

''ప్లీజ్ చెప్పండి. నాకు ఏదైనా వినాలని ఉంది.''

''సరే, వినండి. అయ్యప్ప వాళ్లది పెద్దగా సంగీత కుటుంబం కాదు. వాళ్ల అమ్మ ఎప్పుడైనా పాటలు

పాడేదేమో నాకు తెలియదుకానీ వాద్యసంగీతం మాత్రం వాళ్లకు అస్సలు తెలియదు. అది వీడికి వచ్చేసింది. ఎలాగో తెలుసా? మా ఊళ్లో వీళ్ల ఉండేచోట ఒక పెద్ద చర్చి ఉండేది. ప్రతి ఆదివారం అక్కడ క్రిస్టియన్లు మైకులు పెట్టి ఆర్కెస్ట్రా పెట్టి పాటలు పాడుతూ ప్రేయర్లు చేస్తూ ఉండేవారు. వాళ్ల దగ్గర చాలా ఇన్‌స్ట్రుమెంట్స్ ఉండేవి. తబలా, కాంగో, హాలో గిటార్, ఫ్లూట్, డ్రమ్స్... వాటిని చూసేకొద్దీ వీడికి మైకం కమ్ముకొచ్చేది. అవి చూడ్డానికని ప్రతి ఆదివారం మిస్ కాకుండా చర్చికు వెళ్లేవాడు.

"ఒక ఆదివారం ఇక తట్టుకోలేక ప్రేయర్ అయిపోయి అందరూ వెళ్లిపోతుండగా ఫ్లూట్ వాయించే అతని దగ్గరకు వెళ్లి, 'అన్నా నాకు నేర్పించవా నీకు దండం పెడతాను,' అన్నాడట.

"అప్పుడా ఫ్లూటిస్ట్, 'తమ్ముడూ ఇది నేర్పేది కాదమ్మా. ముందు నువ్వే కొంచెం నేర్చుకోవాలి. ఆ తర్వాత నేను కొంచెం నేర్పుతాను. ఆపైన ప్రభువు దయ,' అన్నాడట.

"అతను నిజం చెప్పాడు. కాని వీడు ఎగతాళి చేశాడేమో అనుకుని ఇంటికి వచ్చి వాళ్ల నాన్న దగ్గర ఏడ్చి నెల్లూరు నుంచి ఫ్లూట్ తెప్పించుకున్నాడు.

"చాలా మామూలు ఫ్లూట్ అది. కాని దాని కన్నులు, నునుపుదేలిన దాని కణుపులు, మృదువైన దాని స్పర్శ, పెదవుల దగ్గరకు తీసుకురాగానే అది ముద్దాడిన తీరు వాడిలో ఆటోమాటిక్‌గా సంగీతాన్ని నింపేశాయి. మొదటిసారికే దమ్ము నిలిచింది. ఎలా వచ్చేసిందో ఏమో వాడికి ఫ్లూట్ వచ్చేసింది. ఆ తర్వాత వాడు గిటార్ నేర్చుకున్నాడు. ఆ తర్వాత కీబోర్డ్. వాడికి వాడే. ఎవరూ గురువులు లేరు. విచిత్రం ఏమిటంటే ఇప్పటికీ వాడికి వెస్ట్రన్ నొటేషన్ రాదు. స...ప...స... అని తెలుగులోనే రాసుకొని ప్లే చేస్తాడు. అమేజింగ్‌గా ఉంటుంది చూడ్డానికి..."

ఆమె అంతా వింది. ఏమీ మాట్లాడలేదు.

కాని కాసేపటి తర్వాత, "ఇదంతా నాకు ఎందుకు చెప్పినట్టండీ?" అంది అనుమానంగా.

నేను మాట్లాడలేదు.

"పర్లేదు చెప్పండి. ఎందుకు?"

"ఎందుకు అనంటే మావాడిలో సంగీతం ఉంది. ఉంది కాబట్టి అది బయటకు వచ్చింది. దానిని ఎవరూ ఆపలేరు. ఒకవేళ సంగీతం లేకపోతే లేదా రాయడం లేకపోతే లేదా నృత్యం లేకపోతే దానిని ఎవరూ బయటకు తేలేరు. ఆ సంగతి మీకు తెలియదు. లేదా తెలుసుకోవడం లేదు. అందుకనే డెస్పరేట్‌గా ఇప్పటికిప్పుడు మీ అబ్బాయిని ఏదో చేసేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ముందు మీ అబ్బాయిలో అసలు ఏమైనా ఉందో లేదో తెలుసుకోండి మీరు. ఒకవేళ ఏదైనా ఉంటే ఆ తర్వాత దానిని ఎవరైనా సానబడతారు. అంతే తప్ప వృథాగా పరిగెడితే లాభంలేదు."

ఆమె బదులు చెప్పలేదు.

చాలాసేపటిదాకా తన ఉనికే లేనట్టుగా కారు నడుపుతూ ఉండిపోయింది.

ఇక నాకు అర్థమైపోయింది, ఈ కథ ఇక్కడితో ముగిసిపోయిందని. రేపటి నుంచి బహుశా ఆమె నన్నుగాని, నేను ఆమెనుగాని కలవబోము. కనీసం అది నా కోరిక. కాని జరిగింది వేరు.

"నా గురించి ఏం తెలుసని మీరిలా మాట్లాడారండీ. మీ హెల్ప్ అడిగాననేగా ఈ లోకువ?" అందామె ఉన్నట్టుండి.

ఆమె గొంతు బొంగురుగా పూడుకుపోయినట్టుగా వస్తోంది. అది నేను గమనించాను. కాని వెనక్కు తగ్గడం ఇప్పుడు కుదిరే పని కాదు.

"ఇందులో లోకువ ఏమీలేదు. వాస్తవం చెప్పాను."

"ఏం వాస్తవం?"

"మీకు అర్థం కావాల్సిన వాస్తవం. సాయంత్రం నుంచి చూస్తున్నానుగా, మీరు ముందుకు దౌడు తీస్తున్నారు. మీ అబ్బాయి మాత్రం వెనుక సీట్లో సెల్‌ఫోన్‌తో చతికిలపడి..."

"ఆపండి," కస్సుమందామె.

"ఇంకేం నోరెత్తొద్దు. నన్నుగానీ, మా అబ్బాయినిగానీ ఇన్సల్ట్ చేసే హక్కు మీకు ఎంతమాత్రం లేదు. ఫస్ట్ సే సారీ," పిచ్చెత్తినట్టుగా అరిచింది.

నేను అదిరిపడ్డాను.

చిన్నూ ఒక్క క్షణం ఆట ఆపి నావంక చూసి, ఆ తర్వాత అలాగే చూస్తూ ఉండిపోయాడు.

చాలా ఇబ్బందిగా అనిపించింది. జన్మలో ఎరగనంత ఇబ్బంది. రోషం.

"ఓకే. నేనేం తప్పు మాట్లాడలేదు. అయినప్పటికీ సారీ. ముందు కారాపండి. నేను ఆటోలో పోతాను."

"ఇంత క్రితం నన్ను బుద్ధిలేనిదానిలా చేసి మాట్లాడారు. ఇప్పుడు మర్యాద తెలియనిదానిలా చేయాలనుకుంటున్నారా? ఏం అక్ఖర్లేదు. మిమ్మల్ని మీ

ఆఫీసు దగ్గర దింపేసే పోతాను కూర్చోండి,'' ఆమె అంతే తీవ్రంగా అంది.

నేను తల తిప్పుకున్నాను. ఆమె మౌనం దాల్చింది. చిన్నూ చూసి చూసి తిరిగి వేళ్ల కిందికి సెల్ తీసుకున్నాడు.

బయట వాన ఆగకుండా కురుస్తూనే ఉంది.

ఆకాశం దూరంగా వింత బూడిద రంగులో మెరుస్తూ ఉంది.

ధార.

సముద్రం పొర్లిరావడం వల్ల వేళకాని వేళలో కార్తెకాని కార్తెలో అకాల వర్షం.

కొంపదీసి ఇదేమైనా దుశ్శకునమైన వర్షమా అనిపించింది ఒక్క క్షణం. తెలియని మనుషులతో తగాదాకు దిగాల్సి రావడం దుశ్శకునం వల్ల కాకపోతే మరేమిటి అని కూడా అనిపించింది. ఆపైన ఇల్లు గుర్తుకొచ్చింది. ఈ వానలో చలిలో బండిమీద తడుస్తూ పోవాలి. ఎప్పటికి? ఈమె వదిలితే కదా!

కారు మసాబ్‌ట్యాంక్ సిగ్నల్ దగ్గరకొచ్చి లెఫ్ట్ తీసుకున్నాక మళ్లీ మొదలెట్టింది.

''ఏమండీ... మీతో మాట్లాడొచ్చునా?'' అంది నెమ్మదిగా.

ఇప్పుడామె గొంతు చల్లగా ప్రశాంతంగా ఉంది. అందులో ఏదో వేడుకోలు కూడా ఉన్నట్టనిపించింది.

ఆమె అంది, ''చూడండి, అనవలసిన మాటలన్నీ మీరే అన్నారు. ముందు నేనేమైనా అన్నానా? మీ మాటలకు నాకు తెలియకుండానే హార్ష్‌గా రియాక్ట్ అయి ఉంటే మన్నించండి. ఇక ఈ గొడవను ఇంతటితో వదిలి పెడదాం. చూడండీ... నిజానికి ఇవాళ మీతో చాలా విషయాలు మాట్లాడదామనీ, నా ఫీలింగ్స్‌ను షేర్ చేసుకుందామనీ అనుకున్నాను. మళ్లీ మీరు ఏమైనా అనుకుంటారేమోనని జంకి ఆ ప్రయత్నం మానుకున్నాను. ఇప్పుడు ఇంత జరిగాక ఇక మాట్లాడకుండా ఉండలేను. నా మాటలు వింటారా? ప్లీజ్.''

నేను బదులు పలకలేదు.

రెండు మూడు నిమిషాల తర్వాత ఆమె మెల్లగా తన కథను ప్రారంభించింది.

అయితే ఆమె దగ్గరి నుంచి కాదు, ఆమె నాన్న దగ్గరి నుంచి.

''మీకు మా ఊరితో ఏమైనా పరిచయం ఉందా? లేనట్టయితే ఎప్పుడైనా మా ఊరి పెద్దవాళ్లు కలిసినప్పుడు మా నాన్న పేరు చెప్పి ఆయన గురించి అడగండి చెబుతారు. మా నాన్న ఒక డాక్టరు. అందరూ ఆయన హస్తవాసి మంచిదనీ, మందిస్తే టక్కున నయమైపోతుందనీ మేజిక్ డాక్టర్ అని పిలిచేవాళ్లు. కొంత మంది మాత్రం మంగలి డాక్టర్ అనేవాళ్లు. మంగలి అంటే తెలుసు కదా! అది మా కులం.

''మా తాత బార్బర్. రెడ్లకు మేర చేసుకుంటూ ఏడాదికాలం వాళ్లకు సేవ చేస్తూ పెద్ద పండగకొకసారి వాళ్లిచ్చే వడ్లగింజలతో కుటుంబాన్ని పోషించుకుంటూ బతికేవాడట ఆయన. రెడ్ల దగ్గర పని లేనప్పుడు ఖాళీ సమయం దొరికినప్పుడు చిల్లర డబ్బులు వస్తాయని ఎప్పుడైనా కత్తులపెట్టె తీసుకొని, మా నాన్న చేయి పట్టుకొని పల్లెల్లోకి వెళ్లేవాడట మంగలి పనికి. దారిలో ఎవరు పిలిస్తే వాళ్లకు, ఎక్కడ కూర్చోను వీలైతే అక్కడ ఆయన ఆ పని చేసేవాడట. మా నాన్నకు కూడా నేర్పించాలని ఆయన తాపత్రయం. మా నాన్న కూడా నేర్చుకునేవాడేమో కాని ఒకసారి ఒకటి జరిగింది.

''మా తాత ఒక ఊళ్లో క్షవరాలు చేసి పొద్దుపోయిందన్న కంగారులో కత్తిరించిన జుట్టును సరిగ్గా పారబోయకుండా ఇంటికి వచ్చేశాడట. అది చూసి ఆ ఊరివాళ్లు పోనీలే అని ఊరుకోకుండా పంతానికి పోయి మరుసటిరోజు మా తాత దగ్గరకు మనిషిని పంపించారు తగాదాకి. ఆ మనిషి నేరుగా మా ఇంటికి వచ్చి, మా అవ్వ ఎదుటే మా తాతను పట్టుకొని, 'గొరిగిన బొచ్చు ఎవడు పారబోస్తాడయ్యా? నీ పెళ్లాం మిండగాడా?' అన్నాడట. అంత పెద్ద మాటకు మా తాత బాధపడలేదు. కోపం తెచ్చుకోలేదు. అమాయకంగా నవ్వి, 'అలాగా సామీ... మసకలో చూసుకోలేదు దేవర,' అని అంత దూరమూ మళ్లీ నడుచుకుంటూ వెళ్లి ఆ వెంట్రుకలన్నీ చిమ్మి మూటగట్టుకొని ఇంటికి తిరిగి వచ్చాడు. అది ఆఖరు. ఆ తర్వాత మా నాన్న మా తాతతో కలిసి ఎప్పుడూ పనికి వెళ్లలేదు. బడికి వెళ్లాడు.

''డాక్టరు చదివితే జనం దేవుడిలా చూస్తారనీ, నెత్తిమీద పెట్టుకొని పూజలు చేస్తారనీ మా నాన్నకే అనిపించిందో లేక ఎవరైనా చెప్పారో నాకు తెలియదు. మొత్తం మీద ఆయనకు డాక్టరు చదవాలనిపించింది. కాని అందుకు సరిపడా డబ్బు లేదు. స్తోమత అంతకన్నా లేదు. ఎంబిబిఎస్ చదవడం మహరాజుల పనేగాని మంగలోళ్ల పని కాదుగా. మా నాన్న పట్టు వదల్లేదు. ఏమనుకున్నాడో ఏమో నేరుగా మద్రాసు వెళ్లిపోయి అక్కడే జిసిఐఎమ్ అనీ అందులో చేరిపోయాడు.

''యునాని, ఆయుర్వేదం ఇంకా అలాంటి ఇండిజినియస్ మెడిసిన్ గురించి చెప్పే చదువు అది.

డిప్లొమాతో సమానం. కాని మా నాన్నకు అది సరిపో యింది. ఆయనకు కావలసిన డాక్టరు పట్టాను చేతి కిచ్చింది. అయితే మా నాన్న అంతటితో ఆగలేదు. ప్రాక్టీసుకు తనుచదివిన ఆయుర్వేదం ఒక్కటే సరి పోదని, అల్లోపతిలో కూడా నలగాలని ఆ రోజుల్లోనే గ్రహించాడాయన. అందుకని మూడేళ్లపాటు మద్రాసు లోనే పనిచేసి అప్పుడు మా ఊరు తిరిగొచ్చి ప్రాక్టీసు మొదలెట్టాడు.

"చాలా కళగా ఉండేవాడు మా నాన్న. అమిత అందంగా నవ్వేవాడు. అసలు ఆ నవ్వుతోనే సగం ధైర్యం వచ్చేస్తుందని పేషంట్లు చెప్పుకునేవారు. అలాంటి మా నాన్న నాకు ఐడల్. చిన్నప్పట్నించీ నాకు ఆయనంటే ఆరాధన. ఆయనలాగా డాక్టర్ కావాలని, అది కూడా ఎంబిబిఎస్ డాక్టర్ కావాలని కోరిక. ఆయన చదవలేకపోయింది నేనైనా చదవాలని పట్టుదల. దాంతో చదువు... చదువు... చదువు... అదే పనిగా ఉండేది నాకు. కాని దురదృష్టం. నేను డాక్టరు కావడం మా నాన్న చూడనేలేదు. ఫైనలియర్‌లో ఉండగానే పోయాడాయన," అని ఆగిందామె.

తండ్రి జ్ఞాపకాలు చుట్టుముట్టాయా అన్నట్టుగా కాసేపు మౌనంగా ఉండి పోయింది.

అప్పటికే నేను కథలో లీనమై ఉన్నాను. తర్వాతి మాటల కోసం ఎదురుచూస్తూ ఉన్నాను.

ఆమె తేరుకుని అంది.

"బతికినంతకాలం మా నాన్న చాలా హాయిగా బతికాడు. జనం ఆయనను నెత్తి మీద పెట్టుకొని చూసుకున్నారు. డాక్టరయ్య, డాక్టరయ్య అంటూ ఎంతో మర్యాద చేశారు. మా నాన్న జీవితం సుఖంగా, ప్రశాం తంగా గడిచిపోవడానికి ఈ ప్రేమ, ఆదరణ, వృత్తిలో ఆయన సాధించిన ఆత్మతృప్తే కారణం అని నేననుకునే దాన్ని. నేను కూడా పెద్దయ్యి డాక్టరయ్యాక ఆయనలా హాయిగా, ప్రశాంతంగా, శాటిస్‌ఫాక్షన్‌తో బతికితే చాలనుకునేదాన్ని.

"కాని అదంతా గతం. నా అజ్ఞానం. మా నాన్నను అర్థం చేసుకోవడంలో నేను పూర్తిగా పొరబడ్డానని ఆ తర్వాత చాలాకాలానికి నాకు అర్థమైంది. దాని ఫలితం అనుభవంలోకి వస్తే తప్ప అది ఎంత పెద్ద పొరపాటో తెలిసి రాలేదు," అని మాట్లాడటం ఆపేసిందామె.

ఇప్పుడు కారు నాగార్జున సర్కిల్ దగ్గరకు చేరు కుంది. ఇక అప్ ఎక్కితే మా ఆఫీసు.

అది గమనించి ఆమె ఇంకా ఏమైనా మాట్లాడు తుందేమో అన్నట్టు చూశాను. లేదు. ఒడుపుగా గేర్లు మారుస్తూ, వెనకొస్తున్న వాళ్లకు బ్లింక్ ఇస్తూ కారును సైడ్‌కు తీసుకొని మా ఆఫీసు ముందు ఆపిందామె.

అప్పటికే వాననీళ్లు టైర్లను ఒరుసుకునేంతగా ప్రవహిస్తున్నాయి రోడ్డు మీద. గొడుగు వేసుకొని గేటు దగ్గర నిలుచుని ఉన్న సెక్యూరిటీ గార్డు ఎవరా అన్నట్టు తొంగి చూడ్డానికి వచ్చాడు దగ్గరికి.

ఇక నేను దిగాలి. దిగి గుడ్‌బై చెప్పాలి.

కాని ఇంతసేపూ ఎదురుచూసిన ఆ పనిని ఇప్పుడు చేయలేకపోతున్నాను. కాళ్లు కదలడం లేదు. సిమెంటు చేసినట్టుగా బిగుసుకుపోయాయి. కారణం తెలుస్తూనే ఉంది. కథ సగంలో ఉంది. అనవసరంగా ఆమె దానిని మొదలుపెట్టి నాకు తెలియకుండానే నన్నందులో కూరుకుపోయేలా చేసింది. ఇప్పుడది ముగిసేదాకా నాకు మనశ్శాంతి లేదు. బహుశా ముగిం చేదాకా ఆమెకూ ఉండకపోవచ్చు.

ఇద్దరం మొఖామొఖాలు చూసుకున్నాం.

"మీరు మా ఇంటికి రాకూడదా నాతోటి?" అందామె.

నా మనసు ఊగిసలాటలో పడింది.

"చెప్పండి?"

"అంటే బాగా లేటవుతుందేమోనని."

"ఎంత లేటైనా కాస్త వచ్చి పొండి. ప్లీజ్. ఈ ఒక్క రోజుకి. రేపటి నుంచి మిమ్మల్ని డిస్టర్బ్ చేయను. కావా లంటే మా ఇంటి నుంచి నేరుగా ఆటోలో వెళ్లిపోదురు. సరేనా?"

"సరే,"

"అమ్మయ్య. ఇంటి దగ్గర ప్రాబ్లమ్ ఏమీలేదు కదా?"

"అబ్బే... అదేం లేదు."

"దెన్... జస్ట్ కాల్ హర్. కొంచెం లేటుగా వస్తానని చెప్పండి," అని తన సెల్‌ఫోన్ తీసి నా చేతికిచ్చింది ఫోన్ చేయడానికి.

నేను ఆలోచిస్తూ ఇంట్లో ఏం చెప్పాలో ప్లాన్ చేసుకుంటూ ఉండగా మళ్లీ ఆపింది.

"ఫోన్ చేసే ముందు ఒక్క నిమిషం. ఇప్పుడు నాకూ మావాడికీ మధ్య జరిగే సంభాషణను మీరు పట్టించుకోకూడదు."

"అదేమిటీ?"

"అదంతే. మామూలుగా అయితే మిమ్మల్ని కారు దిగి ఒక నిమిషం బయట వెయిట్ చేయమని చెప్పేండేదాన్ని. వాన పడుతోంది కదా. అందువల్ల మీ ముందే మాట్లాడక తప్పడంలేదు. ఇప్పుడు మాట్లాడక

పోతే వాడు దారిలో అయినా గొడవ చేస్తాడు. అందుకని...''

ఆమె ఏం చెబుతోందో నాకు అర్థం కాలేదు.

కాని ఆ సంగతిని పట్టించుకోనట్టుగా అతనివైపు తిరిగిందామె.

సంభాషణ మళ్లీ ఇంగ్లీషులో మొదలైంది.

''చిన్నూ! అంకుల్‌ని మన ఇంటికి తీసుకెళ్దామా నాన్నా డిన్నర్‌కి?''

''వద్దు.''

''ఏయ్... అంకుల్ కదా. నీకు హెల్ప్ చేస్తున్నారు కదా. మద్రాస్ అంకుల్ దగ్గరకు తీసుకువెళ్లారు కదా!''

''నేను అడిగానా?''

''కన్నా, అలా మాట్లాడొచ్చునా? తప్పు కదూ. ఆయనకు మనం మర్యాద చేయాలిరా. అది మానర్స్. నువ్వు మానర్స్ నేర్చుకోలేదూ?''

''లేదు.''

''చిన్నూ...''

''అరవకు. అసలు ఇదంతా నాకు ఇష్టం లేదు. వద్దు వద్దంటున్నా నువ్వే బలవంత పెట్టి తీసుకొచ్చావ్. ఇందాకట్నించి చూస్తున్నాను. మీరిద్దరూ లొడలొడా మాట్లాడుకోవడం కూడా నాకు నచ్చలేదు. ఇతను అంత కన్నా నచ్చలేదు. ముందు దింపేసెయ్. పోదాం.''

''చిన్నూ!'' మూలిగినట్టుగా అరిచిందామె.

చిన్నూ ఏమీ మాట్లాడలేదు.

ఆమె బుస కొట్టినట్టుగా గాలి ఒదిలి, రెండు చేతులనూ స్టీరింగు మీద దబ్బున బాది, వేగంగా కారు వెనక్కు తిప్పింది.

నేను ఫోన్ చేయడం మాని బిక్కచచ్చి కూర్చున్నాను.

ఇంకోసారి వేరొకసారి అయితే నా రియాక్షను ఏమిటోగాని అప్పుడు మాత్రం ఆమె చెప్పినట్టుగానే అతని మాటలను పట్టించుకోకుండా ఉండటానికి ప్రయత్నించాను. నాకు ఆమె ముఖ్యం. ఆమె కోరినట్టుగా ఆమెతో కాసేపు మాటలు ముఖ్యం. ఆమె కథ తెలుసుకోవాలి. అందుకు ఈ ఒక్కరోజు ఏం జరిగినా భరించాలి. అంతే. అంతవరకూ ఈ దెయ్యంగాణ్ణి (వేరే మాట అనుకున్నాను) పట్టించుకోకూడదు.

అలా అనుకున్నాక విశ్రాంతిగా వెనక్కు వాలి కూర్చున్నాను.

ఆమె కూడా మాట్లాడకుండా ఉండిపోయింది.

చిన్నూ నావైపు చూసి చూసి అలాగే చూస్తూ ఉండిపోయి ఆ తర్వాత మళ్లీ సెల్‌ఫోన్‌లోకి పోబోయాడు. ఛార్జి అయిపోవడం వల్ల ఏం చేయాలో తెలియక మెల్లగా కళ్లు బయటకు సారించాడు.

కారు ఖైరతాబాద్ చౌరస్తాకు వచ్చింది. అక్కణ్ణుంచి లక్డీకాపూల్. ఆ తర్వాత బషీర్‌బాగ్ ప్రాంతం వైపుగా కదిలి ఒకటి రెండు కిలోమీటర్ల తర్వాత ఒక కాలనీకి చేరుకుంది.

పోష్ అపార్టుమెంట్లు ఉన్న కాలనీ అది. చాలా మటుకు కొత్త కొత్త బిల్డింగులే కనిపిస్తున్నాయి. వీళ్లు ఉంటున్న అపార్ట్‌మెంట్స్ మొదట్లోనే వచ్చాయి.

''రండి. లిఫ్ట్ ఈవైపు ఉంది,'' అందామె కారు దిగి సెల్లార్‌లో దారి చూపిస్తూ.

చిన్నూ మా వెనుకే దిగి కీబోర్డు పట్టుకొని మాట్లాడకుండా వచ్చి నిల్చున్నాడు.

లిఫ్ట్ కదిలింది. నెంబర్లు చూస్తున్నాను.

ఫస్ట్... సెకండ్... థర్డ్... ఫోర్త్...

ఇంటి డోర్ మీద నెంబర్ ఉంది. ఫోర్ నాట్...

ఆమె బెల్లు కొట్టిన కాసేపటికి పదహారు పదిహేడేళ్లున్న ఒక బక్కపలుచటి అమ్మాయి వచ్చి తలుపు తీసింది. ఆ అమ్మాయి పంజాబీ డ్రెస్‌లో ఉంది. పనమ్మాయిలా ఉంది. నన్ను చూసి ఆశ్చర్యపడినట్టుగా కనిపించింది.

''గెస్ట్ వచ్చాడే. పొయ్యి మీద అన్నం పెట్టు. ఎగ్స్ ఉన్నాయి కదా?''

''ఉన్నాయమ్మా.''

''ముందు బాబుకు అన్నం తినిపించెయ్. వాడు మార్చుకోవడానికి బట్టలు ఇవ్వు,'' అని నన్ను హాల్లోకి తీసుకు వెళ్లి సోఫాలో కూర్చోబెట్టింది.

ఆ పక్కనే తను కూడా కూర్చుంటూ, ''చిన్నూ,'' అంటూ పిలిచింది.

చిన్నూ జవాబివ్వలేదు.

''చిన్నూ, ఇక్కడికి రారా,'' అని అరిచింది ఇంగ్లీషులో.

చిన్నూ వచ్చి నిలబడ్డాడు.

ఆమె వాడివైపు తీక్షణంగా చూసి, అంతలోనే మెత్తబడిపోయి పక్కన కూర్చోబెట్టుకుంటూ బుజ్జగిస్తున్న ధోరణిలో మాట్లాడింది.

''చిన్నూ, చూడు నాన్నా... అంకుల్ వచ్చారు. పాపం ఆయన నీకోసమే తన టైం అంతా స్పేర్ చేశారు. ఆయనతో కాసేపు మాట్లాడి - నీ గురించే - నీ మ్యూజిక్ గురించి - ఆయన భోజనం చేశాక పంపించేద్దాం సరేనా. ఈ లోపల నువ్వు భోంచేసెయ్యి. పాలు తాగు. నీ గది

లోకి వెళ్ళి పడుకో. కావాలంటే కంప్యూటర్లో గేమ్స్ ఆడుకో. ఏమ్మా. ఆయన వెళ్లగానే నేనొచ్చి నీ దగ్గర పడుకుంటాను. సరేనా? మా బుజ్జి కదూ...''

చిన్నూ మాట్లాడలేదు.

''చెప్పు నాన్నా. అమ్మను కదా. అమ్మను ఏడిపించవచ్చా. ఇలా నేను నిన్నెప్పుడైనా రిక్వెస్ట్ చేశానా? నువ్వే చెప్పు? ఈ ఒక్కసారికి... కన్నా.''

''సరే.''

''నన్ను డిస్టర్బ్ చేయకుండా ఉంటావా మరి?''

''ఊఁ''

''గుడ్,'' సంతోషంగా ఊపిరి పీల్చుకుందామె.

చిన్నూ వెళ్లిపోయాడు.

ఆమె మళ్లీ ఫోన్ నా చేతికి ఇస్తూ, ''ఇంటికి ఫోన్ చేసి మాట్లాడుతుండండి. ఇప్పుడే వస్తాను,'' అని మొదట వంటగదిలోకి, తర్వాత తన గదిలోకి వెళ్లిపోయింది.

నేను ఫోన్ మాట్లాడాక ఇంటినే పరిశీలిస్తూ ఉండిపోయాను.

త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్. ఫైన్‌గా ఉడ్‌వర్క్ చేసిన అల్మారాలు, డాంబికంగా కనిపించకపోవడమే ప్రత్యేకతగా కలిగిన ఖరీదైన వస్తువులు, కోడిగుడ్డు ఆకారంలో తెల్లగా మిలమిలా మెరిసిపోతున్న వాష్‌బేసిన్లు...

హాలు గోడల మీద మూడు నాలుగుచోట్ల చిన్నూ ఫోటోలు, రకరకాల వయసులవి, పెద్దగా లామినేట్ చేసి తగిలించి ఉన్నాయి. ఒక ఫోటోలో చిన్నూతో పాటు అతని అమ్మానాన్నలు కూడా ఉన్నారు. అతను బాగున్నాడు ఆమెతో సమానంగా.

ఆమె ఫ్రెష్ అయ్యి, నైటీలోకి మారి హుషారుగా బయటకు వచ్చింది.

''ఏర్పాట్లు జరుగుతున్నాయి. కాసేపు ఓపిక పట్టాలి మీరు,'' అంది నవ్వుతూ.

ఆమెను చూస్తుంటే ఎందుకనో చాలా సంతోషంగా ఉన్నట్టు కనిపించింది. అది సాయంత్రం నుంచి నేను చూసిన ముఖం కాదు. చామనఛాయలో కళగా ఉన్న ఆమె రూపం ఆ తేలికపాటి రంగుల నైటీలో ఆకర్షణీయంగా ఉంది.

''మీ హజ్బెండ్ లేరా అండీ?'' అన్నాను ఆమెతో.

''ఆయన ఇక్కడ ఉండరు. అబ్రాడ్‌లో వుంటారు,'' అంది క్లుప్తంగా.

వెంటనే ఏదో గుర్తుకొచ్చినదానిలా లేచి, హ్యాండ్ బ్యాగ్ దగ్గరకు వెళ్లి, బ్యాగులో నుంచి మళ్లీ ఆ చిన్న బాటిల్ తీసి, కళ్లల్లో డ్రాప్స్ వేసుకుంది. ఆ తర్వాత కనుగుడ్లను గుండ్రంగా తిప్పుతూ కళ్లల్లో ఉన్న నీటిని జాగ్రత్తగా మూలలకు సర్దుకుంటూ ఉండిపోయింది.

పనమ్మాయి వచ్చి, అక్కడున్న కొయ్యకుర్చీల్లోని ఒకదానిని బరువుగా లాక్కుంటూ పక్కగదిలోకి తీసుకు వెళుతుంటే ఆమె అంది, ''అటువైపు సిటౌట్ బాగుంటుందండి. వాన వస్తోంది కదా. కాబట్టి కూర్చోలేము. ఎట్‌లీస్ట్ డోర్ దగ్గర సెటిలైనా హాయిగా ఉంటుందనీ... పదండి,'' అంటూ లేచింది.

ఆమె వెనుక నేనూ లేచాను.

అప్పటికే లోపల మరో కుర్చీ ఒక టీపాయ్ వున్నాయి. బహుశా ఆమె అక్కడ రోజూ కూర్చుంటూ ఉండాలి. ఇవాళ మాత్రం గెస్ట్ కుర్చీ అదనం.

సిటౌట్ తలుపు తెరిచి పెట్టి ఉంది.

అటువైపు నుంచి వస్తున్న గాలి వానకు తడిసి చల్లగా శరీరాలను తాకుతూ ఉంది.

జల్లు మామీద పడనంత దూరంలో కూర్చున్నాం.

''ఒకటి అడిగితే ఏమీ అనుకోరుగా. వైన్ ఉంది. తీసుకుంటారా?'' అందామె.

''వద్దు. అలవాటు లేదు.''

''ఏమిటి? డ్రింక్ అలవాటు లేదా?''

''కాదు. వైన్ అలవాటు లేదు.''

''అయ్యో. జిన్ ఉందండి. కాకుంటే సగమే వుంది,'' అని కప్‌బోర్డ్ తెరిచి బాటిల్ చూపించింది.

''సరిపోతుందా?''

''సరిపోతుంది.''

పనమ్మాయి రోజూ చేసే పనిలాగా గ్లాసులూ, మంచినీళ్లూ పెట్టి, గది తలుపు పాక్షికంగా వేసి వెళ్లిపోయింది.

ఆమె డ్రింక్ కలిపాక, ఛీర్స్ ఏమీ లేకుండా గుక్క తీసుకుంటూ, ''ఇందాక ఏమిటండీ అన్నారు మీరు మావాడి గురించి? ముందు వాడిలో ఏముందో చూసుకోండి అనే కదా,'' అంది.

నేను కంగారుపడ్డాను.

''టెన్స్ కాకండి. నేను మామూలుగానే అడుగుతున్నాను. తగాదాకి కాదు,'' అంది నవ్వుతూ.

ఆ తర్వాత గ్లాసును బుగ్గకు ఆనించుకుంటూ, సాలోచనగా ముఖం పెడుతూ, ''అంత టైమ్ ఎక్కడుందండీ. మావాడిలో ఏముందో చూసుకునేంత టైమ్ ఎక్కడుంది. బతుకంతా ఒక మెట్టు నుంచి ఇంకో మెట్టుకు, ఒక అసంతృప్తి నుంచి ఇంకో అసంతృప్తికి పరిగెట్టడమే సరిపోయిందే,'' అంది లోతుగా.

ఆమెను చూస్తుంటే చెప్పాల్సిన కథను వెతుక్కుం టున్న దానిలా కనిపించింది.

నేను గ్లాసు అందుకున్నాను. ఆమె కథలోకి వెళ్లింది.

ఈసారి వాళ్ల నాన్న దగ్గరకు కాదు. కాలేజీ దగ్గరకు.

''ఎయిటీ ఎయిట్‌లో ఉస్మానియాలో నా ఎంబిబిఎస్ అయిపోయింది. కాని ఆ కాలమంతా ఒక వింతకాలం. మెడికల్ ఫీల్డ్‌లో పెనుమార్పులు వస్తున్న కాలం. అసంతృప్తులు పెల్లుబుకుతున్న కాలం కూడా.

''అప్పటికే మా ప్రొఫెసర్లు వాళ్ల ఫ్రస్ట్రేషన్‌నో లేదంటే జీవితానుభవాన్నో మాలోకి ఇంజెక్ట్ చేయడం మొదలు పెట్టేసున్నారు. మెడికల్ ప్రొఫెషన్ ఇక ఎంత మాత్రమూ నోబుల్ ప్రొఫెషన్ కాదని, అలాంటి మిత్ గనక ఏర్పరుచుని ఉంటే వెంటనే తొలగించుకోమని, లేకుంటే ఆ బరువు కింద పడి చస్తారని వాళ్లు డైరెక్టుగా క్లాసురూముల్లోనే మాకు బోధనలు మొదలెట్టేశారు.

''అయితే వాళ్లు బోధిస్తే తప్ప తెలుసుకోలేని స్థితిలో మెడికోలు లేరు. అప్పటికే తరం మారిపోయి ఉంది. రోగులు, సేవ, వైద్యం, పవిత్రమైన వృత్తి అనే మాటలు పలుచబడిపోయి కెరీర్ ఓరియంటేషన్ పెరిగి పోయి ఉంది. మెడిసిన్ చేస్తే డబ్బులు బాగా వస్తాయని, కట్నాలు గిట్నాలు బాగా ముడతాయని, కెరీర్ బాగుం టుందని ఆశపడేవాళ్లే ఎక్కువైపోయారు. కాని అలాంటి కెరీరిస్టులందరికీ సరిగ్గా మా బ్యాచ్ టైములోనే గట్టి ఎదురు దెబ్బ తగిలింది.

''ఎందుకంటే అప్పటికే నాలుగేళ్లుగా గవర్న మెంట్ రిక్రూట్‌మెంట్స్ లేవు. ఆపేశారు. సీనియర్లే బోలె డంతమంది ఖాళీగా ఉన్నారు. మరోవైపు సర్వీసులో చేరిన వాళ్ల అనుభవాలు కూడా హారిబుల్‌గా వున్నాయి. ఇక మిగిలింది ప్రయివేట్ ప్రాక్టీసు. డబ్బుంటే నర్సింగ్ హోమ్‌లు తెరవొచ్చు. లేదంటే ఇంకా కష్టం. స్టెత్ పట్టు కొని బల్ల వేసుకొని ఎక్కడైనా కూర్చోవాలి.

''అయితే ఆ పని చేద్దామన్నా అప్పుడే సిటీలోకి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వచ్చి పడి అలాంటి ఆశనూ ధైర్యాన్ని సందేహంలో పడేశాయి. అపోలో, సిడిఆర్‌లు పెద్ద బ్యాంగ్‌తో మొదలయ్యాయి. వాటి వెనుక మెడ్విన్ క్యూలో ఉంది. పెద్ద పెద్ద భవంతులు.. ఉస్మానియాలో మేము పొరపాటున కూడా చూసి ఎరగని లేటెస్ట్ ఎక్విప్‌మెంట్... అంతవరకూ ఉన్న నిమ్స్, చర్చ్ హాస్పిటల్స్‌నే కాదు చిన్నా పెద్దా ప్రయివేట్ ప్రాక్టీష నర్లందరినీ ఛాలెంజ్ చేస్తూ కవ్విస్తూ రంగప్రవేశం చేశాయి అవి. అనివార్యమైన మోడర్న్ డెవలప్‌మెంట్.

''ఇదంతా చూసి, విని ఏం చేయాలో తెలియక మైకం వదిలిపోయిన చాలామంది మా బ్యాచ్‌మేట్స్ అసలీ ఫీల్డ్‌లోకి ఎందుకొచ్చామా అని తలలు పట్టు కున్నారు. కొందరైతే మనం చదివింది ఏమిటి, చేయా ల్సింది ఏమిటి అని కూడా చూడకుండా ఐఎఎస్, ఐపిఎస్‌లకు ఎయిమ్ చేస్తే మరికొందరు గ్రూప్ ఒన్ లోకి పలాయనం చిత్తగించడానికి సిద్ధమైపోయారు. ఆ పరిస్థితుల్లో, ఆ గందరగోళంలో నేనూ, నా భర్తా సింపుల్ ఎంబిబిఎస్‌లతో రోడ్డు మీదకు వచ్చి నిలుచున్నాం.

''మేము మా లైఫ్‌ని స్టార్ట్ చేయాలి. విడివిడిగా కాదు. కలిసి. పెళ్లి చేసుకుని. అప్పటికే మా నాన్నలేరు. అమ్మ ఏనాడో పోయింది. అక్కకు ఉద్యోగం వచ్చి, పెళ్లయ్యి సెటిలైపోయింది. కాబట్టి నా వైపు నుంచి మా ప్రేమకు అడ్డు చెప్పేవారు లేరు. కాని నా భర్త వైపు నుంచి మాత్రం అదంత సులువు కాలేదు. మా పెళ్లికి వాళ్లు ఎస్ అనలేదు. అలాగని నో అని కూడా చెప్పలేదు. జస్ట్ ఇన్‌వాల్వ్ కాకుండా ఊరుకున్నారంతే. మా పెళ్లి జరిగిపోయింది.

''ఆ తర్వాత వాళ్లతో ఇంచుమించుగా మాకు సంబంధాలు లేవు. మేమిద్దరమే మిగిలాం. నాకు నా భర్త. నా భర్తకు నేను. ప్రాక్టీసు మొదలెడదాం అను కున్నాం. అయితే సిటీలో అదంత ఈజీకాదు. అప్పటికి ఫ్యామిలీ డాక్టర్ల వ్యవస్థ యింకా బీటలు వారలేదు. కాబట్టి మాలాంటి చిన్నా చితకా వాళ్లం కొత్తగా ప్రాక్టీసు పెట్టి వాళ్ల నుంచి పేషెంట్లను లాగడం కష్టం. ఏదైనా ఛాన్సు ఉంటే సబర్బ్స్‌లోనే అని తేలిపోయింది. ఇంకేమీ ఆలోచించకుండా మేము లాలాపేటకు షిఫ్టయిపోయి అక్కడే ఒక షట్టర్ అద్దెకు తీసుకొని ప్రాక్టీసు మొద లెట్టాం...''

తలుపు దగ్గర చప్పుడవడంతో ఆమె చూసింది.

రెండు చేతుల్లో రెండు ప్లేట్లతో నెమ్మదిగా తలుపు తోసుకుంటూ పనమ్మాయి.

ఒకదానిలో హాఫ్ బాయిల్డ్ ఆమ్లేట్లు ఉన్నాయి. మరొకదానిలో తరిగిన క్యారెట్ ముక్కలు.

''రావే,'' అని దగ్గరకు పిలిచింది.

''ఈ పిల్ల లేకపోతే ఏమైపోదునోనండీ,'' అంది నాతో.

పనమ్మాయి వాటిని టీపాయ్ పైన ఉంచి తిరిగి వెళుతుంటే ఆమె అడిగింది- ''వాడు భోజనం చేశాడా?''

''ఇప్పుడే కూర్చుంటున్నాడమ్మా.''

''వాడు అడిగినవి పెట్టు. బలవంతం చేయకు. అవసరమైతే నన్ను పిలు.''

''సరేనమ్మా.''

''నువ్వు కూడా తినెయ్.''

ఆ అమ్మాయి వెళ్లిపోయింది.

ఆమె క్యారెట్‌ను కాని, ఆమ్లెట్టును కాని తాక లేదు. వాటిని నా కోసమే వదిలిపెట్టి తిరిగి కథలోకి వెళ్లింది.

''లాలాపేటలో ప్రాక్టీసు మొదలెట్టాకగానీ మాకు తెలిసిరాలేదండీ. లా వేరు ప్రాక్టీసు వేరు లాగా మెడిసిన్ వేరు ప్రాక్టీసు వేరు అని. చెప్తే నమ్మరు. అక్కడ మేము చేసింది ప్రాక్టీసు కాదు. ప్రాక్టీసుకు పట్టిన పీడ. మా దగ్గరకు వచ్చే పేషంట్లే వాళ్లకు ఏమేమి మందులు కావాలో చెప్పేసేవారు. వాళ్లు మేము యిచ్చిన మందులు తీసుకోరు. టాబ్లెట్లు వేసుకోరు. వాళ్లకు కావలసిందల్లా సూదులు. ఎర్రసూది, పసుపు సూది, తెల్ల సూది అని రంగు పేరు చెప్పి మరీ అవి వేయమని అడిగేవాళ్లు. అవే వేయాలి. అలా వేసిన వాళ్లే డాక్టర్లు. కాదు కూడదు అంటే చచ్చినా వచ్చేవారు కాదు.

''కొత్తల్లో చాలా డిస్‌గస్టింగ్‌గా ఉండేది ఇదంతా చూస్తే. అక్కర ఉన్నా లేకపోయినా బి కాంప్లెక్స్, పెన్సిలిన్ సూదుల్ని పొడవాలంటే. అదొక్కటే కాదు, ప్రాక్టీసు నిలబడటానికి ఇంకా చాలా చేయాల్సొచ్చేది. అబద్ధాలు చెప్పాలి. ఉన్నది లేనట్టుగా కల్పించాలి. భయపెట్టాలి. మోసం చేయాలి. వైద్యం తప్ప అన్నీ చేయాలి. ఇవన్నీ చేయలేక చేతకాక తీవ్ర అసంతృప్తిగా ఉండేది నాకు.

''జెస్టేషన్ పీరియడ్ అంటాము చూడండి. ఏ రంగంలో అయినా ఎవరైనా నిలదొక్కుకోవాలంటే పట్టే కనీస కాలం. అన్నీ సర్దుకుపోయి మా మటుకు మేము సెటిలయ్యి పైకి రావాలంటే ఆరేడేళ్లు పడుతుందేమో అనుకునేదాన్ని. కానీ మూడు నాలుగేళ్లకే నా భర్తకు విసుగొచ్చేసింది. ఆ షట్టర్ క్లినిక్‌లో ఇలాగే ఉండిపోతే రస్ట్ అయిపోతామని చాలా త్వరగా గ్రహించాడాయన. ఆ అసంతృప్తిని నేను చాలాసార్లు చూశాను. అది కెరీర్‌కి సంబంధించిన అసంతృప్తి. నా అసంతృప్తి వేరు. అది వృత్తికి సంబంధించింది.

''ఈ అసంతృప్తులు ఇలా ఉండగానే ఊహించని ప్రమాదం ఒకటి వచ్చిపడింది. మెడిసిన్ పూర్తయిన వాళ్లంతా మాలాగే శివార్లకు వచ్చి క్లినిక్‌లు తెరవడంతో లోకల్ ఆర్‌ఎంపిలు, హకీమ్‌లు రిటాలియేషన్ స్టార్ట్ చేశారు. శివార్లలో చాలాచోట్ల డాక్టర్లను పట్టుకొని తన్నారు. నా భర్తను కూడా ఒంటరిగా దొరకబుచ్చుకుని చావబాదారు. దట్ వజ్ ఫైనల్. ఇదంతా ఎందుకొచ్చిన గొడవ, పోయి హాయిగా ఏదైనా పెద్ద హాస్పిటల్‌లో చేరిపోతే బాగుంటుంది కదా అన్నాడాయన. అందుకు ఉన్న చదువు సరిపోతుంది. కాని పైకి వెళ్లడానికి చాలదు. పైకి వెళ్లాలంటే పై చదువులు కావాలి. ఆయన పిజి చదవడానికి వెళ్లిపోయాడు.

''అప్పుడు నేను గర్భంతో ఉన్నాను. పిల్లనో పిల్లాడ్నో కని హాయిగా గడిపేద్దాం అనే కలల్లో ఉన్నాను. కాని నా భర్త డెసిషన్ తీసుకున్నాడు. కనుక నేను దానిని సపోర్ట్ చేయాలి. అంతేకాదు ప్రాక్టీసు కూడా కొనసాగించాలి. ఎందుకంటే ఆయనకొచ్చే స్టయిపెండ్ ఏ మూలకూ చాలదు. అలా నేను యిల్లు నడిపాను. చంటిబిడ్డతో వెళ్లి ప్రాక్టీసు చేశాను. నిజం చెప్పాలంటే నా జీవితంలో అది అత్యంత కష్టమైన కాలం. అంతా భరించాను,'' అందామె.

ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూనే గబగబా తాగడాన్ని నేను గమనించాను.

వైన్‌లోనే ఆ సౌకర్యం ఉందో లేదంటే ఆమె వేగమే అంతో.

ఆమె మళ్లీ అందుకుంది.

''నా భర్త పిజి పూర్తయ్యేనాటికి సిటీలో పెద్ద సంఖ్యలో కార్పొరేట్ హాస్పిటల్స్ వచ్చిపడ్డాయి. వ్యాపారం మొదలైపోయింది. బిగ్ ఇండస్ట్రీ. జీతాలకు స్పెషలిస్టులు కావాలి. నా భర్త చేరిపోయాడు అనెస్థటిస్ట్‌గా. ఇక నా వంతు వచ్చింది.

''అప్పటికే లేడీ డాక్టర్లకు లాభసాటిగా ఉన్న చదువు ఏమిటో తేలిపోయింది. రేడియాలజీ, పిడియాట్రిక్స్, గైనకాలజీ. నేనిప్పుడు గైనకాలజీ చదవాలి. అయితే ఆ పని చేసేందుకు నేను ఇష్టపడ్డానా లేదా అని అడిగితే సూటిగా జవాబు చెప్పలేను. ఫ్రాంక్‌గా చెప్పాలంటే రెండూ పని చేశాయి. ఒకటి, ఇప్పుడున్న అసంతృప్తితో ఇలాగే పని చేయడం కంటే మరికొంత చదువుకొని మరికొంత బెటర్‌గా పనిచేయవచ్చేమో కదా అనుకున్నాను. రెండు, బయటినుంచి పనిచేసే కంపల్షన్స్ కూడా నన్ను బాగా ప్రభావితం చేశాయి.

''యూ నో అప్పటికే సాఫ్ట్‌వేర్ బూమ్ మొదలైపోయింది. ఎక్కణ్ణుంచి వచ్చిందో తెలియదుగాని అన్ని రంగాల్లోనూ ఈజీ మనీ పొంగిపొర్లుతోంది. కార్లు, సొంత

ఫ్లాట్లు, రియల్ ఎస్టేట్‌లో స్థలాలు... జనం స్పీడు మీద పరిగెడుతున్నారు. కన్ను మూసి తెరిచేంతలో ఎదిగి పోయి కనిపిస్తున్నారు. అదంతా చూస్తుంటే ఏమని అనిపిస్తుంది? ఈ ఐదూ పది రూపాయల ఫీజులతో ఇలా ఎంతకాలం అనిపిస్తుంది. లేదా అలాంటి భ్రాంతి కలుగుతుంది. మనం కూడా పైకి రావాలి, సొంతంగా మంచి ఫ్లాట్ కొనుక్కోవాలి, కారు కొనుక్కోవాలి, బ్యాంక్ బేలెన్స్ పెంచుకోవాలి, మేము పడ్డ కష్టాలు మావాడు పడకుండా బాగా చదివించాలి, వాణ్ణి మాకంటే పెద్ద డాక్టర్ని చేయాలి అనిపించదా?

"లాలాపేట పేషెంట్లను వాళ్ల ఖర్మానికి వదిలి నేను కూడా రేస్‌లోకి దిగాను. పిజి సీటు దొరికేంత వరకూ అదో పెద్ద హింస. అనుభవించాను. రేయింబ వళ్లు కష్టపడ్డాను. రెండుసార్లు ట్రయ్ చేసి సాధించాను.

"రోజులు గడిచిపోయాయి. నౌ ఉయ్ ఆర్ స్పెషలిస్ట్స్. ఇద్దరం కార్పోరేట్ హాస్పిటల్స్‌లో ఉన్నాం. రోజుకు పన్నెండు గంటలు పని చేస్తున్నాం. లోకానికే కాదు మావాడికి కూడా చచ్చిన మనుషులతో సమానం గా పరుగు పరుగున సంపాదిస్తున్నాం. మాకు కారు ఉంది. ఫ్లాట్ ఉంది. మావాడికి మేము కల్లో కూడా ఊహించనంత భారీ స్కూల్ ఉంది. కాని ఇద్దరికీ అసంతృప్తి మాత్రం పోలేదు.

"నా మటుకు నాకు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టుగా ఉండేది పరిస్థితి. లాలాపేట్‌లో ఉన్నవాళ్లు అమాయకులు. వాళ్లను వాళ్ల కోసమే మోసం చేయాలి. కాని ఇక్కడ అలా కాదు. బాగా చదువుకున్న వాళ్లని బాగా డబ్బున్నవాళ్లని కూడా చాలా సోఫిస్టికే టెడ్‌గా మోసం చేయాలి. అన్నిసార్లు కాకపోయినా చాలాసార్లు వంచన చేయాలి. ముక్కుపిండి డబ్బు వసూలు చేయాలి. ఉత్తపుణ్యానికి కడుపులు కోయాలి. మనకొచ్చే షేర్ కోసం పాపాలు చేయాలి. కనపడని నేరాలు చేయాలి. ఏమిటీ ఖర్మ అనిపించేది చాలాసార్లు. ఒక్కోసారి గిల్ట్‌తో నిద్రపట్టేది కాదు.

"అప్పుడే నా భర్తకు రియాద్ నుంచి మంచి ఆఫర్ వచ్చింది. బిగ్ మనీ. వన్‌మంత్ పెయిడ్ హాలిడేతో నాలుగేళ్ల బాండ్ అడిగారు. ఎలాగోలా ఆ నాలుగేళ్లు అక్కడే కళ్లు మూసుకుంటే ఆ వచ్చిన డబ్బుతో మరో ఇద్దరు ముగ్గురు ఫ్రెండ్స్‌ని కలుపుకొని అందరిలా లోన్లు పెట్టి మనం కూడా ఒక పెద్ద హాస్పిటల్‌ని పెట్టొచ్చు కదా అని నా భర్త ఆలోచన. అదే జరిగితే ఎక్కువ పాపాల నుంచి తక్కువ పాపాల్లోకి వెళ్లొచ్చేమో అని నా ఆశ. ఆయన సౌదీ వెళ్లిపోయాడు. ఇక్కడ నేనూ మావాడు మిగిలాం.

"మళ్లీ రేసు మొదలయ్యింది. ఏం పొందు తున్నామో ఏం కోల్పోతున్నామో చూసుకోనంత వేగంగా రెండేళ్లు పరిగెత్తాం. ఇంకా ఎంత పరిగెత్తేవాళ్లమో కాని నా అదృష్టం బాగుండి అప్పుడే నా జీవితంలోకి ఒక వెలుగులాంటి చీకటి వచ్చింది. ఇవాళ మీ ముందు ఇలా కూర్చుని ఉన్నానంటే ఆ చీకటే కారణం," అందామె విరామం తీసుకుంటూ.

ఇక కాసేపటి దాకా ఆమె ఏమీ మాట్లాడలేదు. డ్రింక్ చేస్తూ ఉండిపోయింది.

నేను నెమ్మదిగా కుర్చీలోంచి లేచి సిటౌట్ దగ్గరకు వెళ్లి నిలబడ్డాను బరువు తేలిక చేసుకో వడానికి.

అక్కడంతా చెమ్మగా ఉంది. చెప్పుల్లేని పాదా లకు నీటి ఉనికి తెలుస్తోంది.

ముఖాన్ని తాకిన జల్లుకి ఒక్కసారిగా ఒళ్లు జలద రించింది.

ఆమెవైపు చూశాను. కుర్చీలో ముద్దగా అమాయ కంగా కూర్చుని ఉందామె. వైన్‌తో తడిసిన పెదాలు మెరుస్తూ కనిపిస్తున్నాయి. అయితే అంతకన్నా మెరుపు ఆమె కథ నిర్వహిస్తున్న తీరులో ఉంది.

కోసి, ముక్కలు చేసి, కలిపి కుట్టే శస్త్ర విద్య లాంటి విద్య ఏదో ఆమె కథ చెప్పే తీరులో ఉంది. అందుకే ఆమె కథను ముక్కలు ముక్కలుగా చెబు తోంది. బహుశా ఇప్పుడు వాటిని కలిపి కుట్టవచ్చు. దగ్గరగా చేర్చి ముడివేయవచ్చు.

"మీకు ఆర్థ్రైటిస్ గురించి డీటైల్డ్‌గా ఏమైనా తెలుసా అండీ?" అందామె, అక్కణ్ణుంచే కదలకుండా.

ఒక క్షణం ఏం విన్నానో అర్థంకాలేదు.

"ఆర్థ్రైటిస్ గురించా? ఏం? ఎందుకని అలా అడిగారు?" అన్నాను అయోమయంగా.

"నాకు ఆ వ్యాధి గురించి డీటైల్డ్‌గా తెలుసు కాబట్టి," అందామె.

నాకు భయం వేసింది.

"ఏమిటి అలా చూస్తున్నారు? మత్తు తలకెక్కి సంబంధం లేని మాటలు మాట్లాడుతున్నాననా? సంబంధం ఉన్న మాటే ఇది."

"ఏమిటి ఆర్థ్రైటిసా?"

"అవును. ముందు వినండి. నాకు ఏడేళ్ల వయసులో మొదటిసారిగా ఆర్థ్రైటిస్ వచ్చిందట. ఆ మాటను మా నాన్న చెప్పడమేకాని నాకు లీలగా కూడా

గుర్తులేదు. ఆయనే ఏవో మందులిచ్చి ఆ వ్యాధిని నయం చేశారట. అప్పటి నుంచి అది తిరిగి కనిపించ లేదుగానీ మావాడు కడుపులో పడ్డాక మళ్లీ కీళ్లనొప్పులు మొదలయ్యాయి. డెలివరీ అయ్యాక వాటికవే వింతగా మాయమైపోయాయి. కాని మూడేళ్ల క్రితం వచ్చినప్పుడు మాత్రం పోలేదు. నరకాన్ని చూపించాయి. కాళ్లు కదపా లంటే నాలుగడుగులు వేయాలంటే మెదడు చిట్లి పోయేది. అంత నొప్పి.

"కాని ఎంత నొప్పి వచ్చినా సాధారణంగా ఆర్థ్రైటిస్‌కు అతిగా మెడిసిన్ వాడకూడదు. కాని మా ఫ్రెండ్ ఒకతను, రుమటాలజీలో డిప్లమా చేసొచ్చాడన్న అదనపు అర్హతతో నా బాధ చూడలేక నాకేవో మందులు ప్రిస్క్రైబ్ చేశాడు. అర్థజ్ఞానంతోటి, అజ్ఞానం తోటి అతడు చేసిన పని ఎట్లాంటిదంటే దెబ్బకు నా చూపుపోయింది."

"ఆ," అన్నాను.

"ఏమిటండీ?" అన్నాను నోరు తెరుస్తూ.

ఆమె నవ్వింది.

"పాపం అతను సదుద్దేశంతోనే ఇచ్చాడు. కాని ఎప్పుడూ డాక్టర్ల చేతుల్లో పేషెంట్లే నష్టపోతే ఎలా? అప్పుడప్పుడు డాక్టర్లు కూడా నష్టపోవాలి. నేను నష్టపోయాను. అతడిచ్చిన మందులు బాగా పనిచేశాయి. కాకుంటే ఎక్కువ పనిచేశాయి. నొప్పిని తొక్కి పట్టేశాయి. వ్యాధి పోలేదు. ఒంట్లోనే విషంలా తిరుగుతూ ఆరునెలల క్రితం కంట్లోకి కొట్టింది.

"చాలా అన్‌యూజ్వల్ అది. కాని ఇవాళ రేపు అన్‌యూజ్వల్ థింగ్సే కదా జరుగుతున్నాయి. అప్పటికి నా భర్త సెకండ్ టైమ్ వచ్చి వెళ్లిపోయాడు. అంతా బాగానే ఉంది కదా అనుకుంటూ ఉండగా సడన్‌గా ఒన్ ఫైన్ మార్నింగ్ నా కళ్లు తెరుచుకోలేదు. దే వర్ డ్రై. మంట. నొప్పి. బలవంతంగా తెరిస్తే ఎర్రగా నిప్పు గోళాల్లా తయారై ఉన్నాయి. ఇమేజ్ కనపడటం లేదు. బ్లర్ అవుతూ ఉంది. ముందు అర్థంకాలేదు. ఏం జరిగిందో తెలిశాక గుండె ఆగినంత పనయ్యింది. సివియర్ అటాక్ అది. ఎల్.వి. ప్రసాద్ లేకపోయి ఉంటే ఈపాటికి గుడ్డిదానిలా తిరుగుతుండేదాన్ని. కాని నష్టం మాత్రం తప్పలేదు. నా టియర్ గ్లాండ్స్ పర్మనెంట్‌గా ఎండిపోయాయి. నా కళ్లు పొడికళ్లుగా మారిపోయాయి...."

నేను లేచి నిలబడ్డాను.

"ఇక వెళతానండీ," అన్నాను.

"అదేమిటండీ?" అందామె చాలా ఆశ్చర్యంగా.

"లేకపోతే ఏమిటండీ... ఏదోలే ఊరి కథ, మంగలి డాక్టర్ కథ చెబుతున్నారని ఆసక్తిగా వస్తే ఇదా మీరు చెప్పేది... జేబులో నుంచి ఒక్కోటి ఒక్కోటిగా కష్టాలు తీస్తున్నారు. ఏం వినేది?"

ఆమె చాలాసేపు నవ్వింది.

"అబ్బ... ఎన్నిరోజులైందండీ ఇలా నవ్వి," అంది.

"కూర్చోండి చాలుగాని. అసలింకా కష్టమే మొదలుకాందే. వినకుండా ఎలా పోతారు?"

నేను కూర్చున్నాను.

ఆమె మొదలెట్టింది.

"క్యాన్సర్‌ని ట్రీట్ చేస్తారు చూడండి... ఇంచుమించు అలా ట్రీట్ చేశారు నా కళ్లని. ఒన్ మంత్ రెస్ట్ తీసుకోమని చెప్పారు. అంటే హాస్పిటల్‌కి పోకుండా ఇంట్లోనే ఉండిపోవాలి. అప్పుడు నేను ఒక హాస్పిటల్‌లో పని చేస్తున్నాను. వెళ్లి సంగతి చెబితే ఒన్ మంత్ అంటే ఎలాగండీ... మీరే ఆలోచించండి అన్నారు మర్యాదగా. మానేసెయ్ అని ఇన్ డైరెక్టుగా చెప్పారన్న మాట.

"ఇక్కడ నా అనారోగ్యం సంగతి తెలిసి అక్కడ రియాద్‌లో నా భర్త పరిస్థితి కూడా అలాగే ఉంది. బాండ్ బ్రేక్ చేసి పంపడానికి వాళ్లు ఒప్పుకోలేదు. ఒక వేళ వెళ్లాలనుకుంటే జరగబోయే నష్టాన్ని కాంపెన్సేట్ చేసి వెళ్లాలని హెచ్చరించారట. 'ఎలా?' అంటూ ఫోన్ చేశాడాయన.

"నాకెందుకో ఒక్కసారిగా మా తాత గుర్తుకొచ్చాడు. గొరిగిన బొచ్చు ఎవడు పారబోస్తాడయ్యా అని అడుగుతున్న మనిషి ఎదురుగా నిలుచున్నది మా తాత కాదు నేనూ నా భర్తా అనిపించింది నాకు. ఇన్నేళ్లుగా మేము పెట్టిన పరుగు ఎక్కడికి చేరుకుందో కూడా అర్థమైంది.

"ఇక క్రమంగా డిప్రెషన్ మొదలయ్యింది. నా అదుపులో లేనంత డిప్రెషన్. ఊరికూరికే ఏడుపొచ్చేది. ఊరికూరికే నవ్వు వచ్చేది. ఒక్కోసారి పిచ్చెత్తినట్టుగా ఉండేది. గట్టిగా వేళ్లు కొరుక్కునేదాన్ని. నా పరిస్థితి గమనించిన నా ఫ్రెండ్ ఒకామె నా ధ్యాస మళ్లించేందుకు ఏవేవో ప్రయత్నాలు చేసింది. యోగాకు తీసుకెళ్లింది. ధ్యానం చేయించింది. అప్పుడే ఏవో కొన్ని పుస్తకాలతో పాటు మీ పుస్తకాలు కూడా తెచ్చిచ్చింది. నిజానికి నాకు లిటరేచర్ తెలియదు. కాని మీ పుస్తకాలు నచ్చాయి. మన ప్రాంతం, మన భాష...పుస్తకాలు నాకు కొత్త ఫ్రెండ్స్ అయ్యాయి. ఆ తర్వాత చాలా చదివాను.

''కాని ఆ డోస్ నాకు చాల్లేదు. ఇంకా ఇంకా ఏదో కావాలనిపించేది. ఒకవైపు ఉద్యోగం మాని పేషెంట్‌గా ఇంట్లో కూర్చోవడం వల్ల ఒంటరితనం. మరోవైపు అవసరమైన వేళలో భర్త తోడు లేకపోవడం... అన్నీ కలిసి డిప్రెషన్ మరింతగా పెరిగింది.

''అటువంటి పరిస్థితుల్లో ఎవరికైనా ఏమనిపిస్తుంది? కాస్త ప్రేమ కావాలనిపిస్తుంది. ఎవరైనా వచ్చి నాలుగు ఓదార్పు మాటలు చెబితే బాగుండనిపిస్తుంది. మా అక్క వచ్చింది. కాని నాలుగంటే నాలుగే రోజులు ఉండి, లీవులు లేవు అంటూ వెళ్లిపోయింది. ఇక నాకు తోడెవరు? మా చిన్నూగాడు. ఆ సమయంలో నాకు వాడి ప్రేమే అన్నింటి కన్నా ముఖ్యమనిపించింది. అదే నాకు సంజీవని. నా పెన్నిధి. కాని ఆ పెన్నిధిని ఏనాడో కోల్పోయానని అప్పుడుగాని తెలిసిరాలేదు నాకు,'' అని ఆగిందామె.

గ్లాసులో ఆమె డ్రింకు అయిపోయింది.

మరోసారి పోసుకొని క్షణం కూడా వృథా చేయకుండా వెంటనే గొంతులోకి వొంపుకుంది.

అప్పటికే సగం బాటిల్ ఖాళీ చేసేసింది. మిగిలిన సగం కూడా ఖాళీ చేసేలా ఉంది.

''మీరు ఎక్కువ తీసుకుంటున్నట్టున్నారు,'' అన్నాను నసుగుతూ.

''పర్లేదులేండి. ఇదేం ఎక్కువకాదు. ఇదే లేకపోతే ఈపాటికి చచ్చుండేదాన్ని. ఇన్‌ఫాక్ట్ సెల్‌ఫోన్లు వచ్చి నన్ను ఎప్పుడో చంపేశాయనుకోండి. అవి నన్నూ నా భర్తని నా కొడుకుని మూడు ముక్కలు చేసేశాయి. నా భర్త రియాద్ వెళ్లాక ఆ తేడా నాకు తెలిసింది. మా ముగ్గురి మధ్యా ఉమ్మడి మాటలు లేవు. అయితే నేనూ నా భర్తా మాట్లాడుకుంటాం. లేదంటే నా భర్తా నా కొడుకూ మాట్లాడుకుంటారు. అంతే. అందుకే మా మధ్య ఏం జరుగుతోందో నాకు అర్థంకాలేదు. వాడు నెమ్మది నెమ్మదిగా నాకు దూరం జరుగుతున్నాడన్న సంగతే నేను పసిగట్టలేకపోయాను.

''ఈ మార్పు ముందే మొదలై ఉండాలి. నా భర్త రియాద్‌కు వెళ్లాక అది ఎక్కువై ఉంటుంది. అతడు పని గట్టుకొని వాడికి ఏదైనా చెప్పి ఉంటాడని నేను అనుకోను. కాని వాడికి దూరంగా ఉన్నానన్న గిల్ట్‌తో ఎక్కువ అటాచ్‌మెంట్‌కి మాత్రం ప్రయత్నించినట్టున్నాడు. వాడితోనే ఎక్కువగా ఫీలింగ్స్‌ని షేర్ చేసుకున్నట్టున్నాడు.

''దాంతో మొత్తం మీద చిన్నూలో ఒకటి స్థిరపడిపోయింది. నాన్న తనకోసం దేశం కాని దేశం వెళ్లి కష్టపడుతున్నాడు. డబ్బు సంపాదిస్తున్నాడు. ఆయన అంత కష్టపడుతున్నాడు కాబట్టి తను కూడా అంతే కష్టపడాలి. అంటే బాగా చదవాలి. ర్యాంకులు తెచ్చుకోవాలి. అమ్మ నాన్న ప్రాపర్టీ కనుక ఆమెను బాగా చూసుకోవాలి. అంటే కాపలా కాయాలి. తిరిగి నాన్నకు జాగ్రత్తగా అప్పజెప్పాలి. చెప్తే ఆశ్చర్యపోతారు మీరు. ఇది ఎక్కడిదాకా పోయిందంటే నేను వాళ్ల నాన్నతో తప్ప వేరే ఏ మగాడితో మాట్లాడినా వాడు టాలరేట్ చేయలేని స్థితికి చేరుకున్నాడు....

''కొత్తల్లో వాడు పదేపదే ఫోన్ చేస్తూ నా వేర్ అబౌట్స్ తెలుసుకుంటుంటే కన్సర్న్‌తో చేస్తున్నాడేమో అనుకునేదాన్ని. కాదు. నా మీద చెకింగ్ అన్నమాట. తల్లిని అనుమానించే కొడుకు. మీరు నమ్మరు. నా మగ స్నేహితులందరూ మా ల్యాండ్‌లైన్‌కి చేయడమే మానేశారు. వీడు ఎత్తాడంటే అవతలి పక్షాన్ని ఏదో విధంగా అవమానించేవాడు.

''ఏమిటిది? వీడు ఎలాంటివాడు? ముందు నుంచీ ఇంతేనా? నేను గమనించలేదా అని గుర్తు తెచ్చుకోవడమే పనైపోయింది నాకు. మాటలు లేవు. సందడి లేదు. ఆ వయసు పిల్లల్లో ఉండాల్సిన అమాయకత్వం లేదు. హుషారు లేదు. ఎప్పుడు చూసినా నంబ్‌గా ఉంటాడు. విపరీతమైన చదువు. కంప్యూటర్‌లో గేమ్స్. నా మీద నిఘా. ఈ మూడు పనులే వాడు చేసేది. చూస్తుంటే నాకు ఏడుపు ముంచుకొచ్చేది. అయ్యో... తల్లిగా వీడికి మళ్లీ ఎలా దగ్గరకు చేరేది? అని తల్లడిల్లిపోయేదాన్ని. ఎంతో ప్రయత్నించి చూశాను. చాలా ప్రేమగా ప్రవర్తించాను. లాభం లేదు. సారో మనుషుల్ని దగ్గర చేస్తుందని అంటారు. చివరకు నా అనారోగ్యం కూడా వాణ్ణి నాకు దగ్గర చేయలేదు. అలాంటి రోజులు వచ్చిపడ్డాయి...''

ఈసారి తలుపు దగ్గర బిగ్గరగా చప్పుడైంది.

ఆమె మాట్లాడటం ఆపి అదురుపాటుతో చూసింది.

చిన్నూ నిలుచుని ఉన్నాడు.

''చిన్నూ. ఇంకా పడుకోలేదా నాన్నా... వస్తున్నా పద,'' అందామె కలవరంగా.

చిన్నూ ఏమీ మాట్లాడకుండా మావైపే చూస్తూ నిలబడ్డాడు.

లావుగా, ఊబగా పెరిగిన శరీరంతో ఆ క్షణంలో అతను వయసుకు మించి ఒక మగాడిలా కనిపిస్తున్నాడు.

"పద నాన్నా... వస్తున్నా పదా..."

"ఇంకా ఏం చేస్తున్నావ్ ఇక్కడ?"

"నీకు తెలియదా? అలా అడక్కూడదు. వెళ్లు. ప్లీజ్."

"రోజూ తాగుతున్నావ్. ఇవాళ ఇంకెవరినో తెచ్చి పెట్టుకుని తాగుతున్నావ్. నాన్నతో చెబుతాను ఉండు."

"చిన్నూ..."

"'ఎందుకు అరుస్తున్నావ్? రాక్షసి. నన్ను వదిలేసి నాన్నను వదిలేసి, ఇంకెవరితోనో. మర్యాదగా అతన్ని బయటకు పంపు. లేకుంటే..." కాళ్లు నేల మీద ధన్ ధన్‌మని తాటించాడు.

ఆమె కదల్లేదు.

"పాలు తాగావా?"

చిన్నూ జవాబు ఇవ్వలేదు.

"చిన్నూ. నిన్నే అడిగేది. పాలు తాగావా లేదా?" పెద్దగా అరిచింది.

"లేదు."

"ఓకె. పద. నీకు పాలు ఇస్తాను. నువ్వు తాగే లోపల ఇతన్ని బయటకు పంపిస్తాను. సరేనా. ఇట్స్ ఎ మ్యాటర్ ఆఫ్ టెన్ మినిట్స్."

ఆమె లేచి చిన్నూని సమీపిస్తూ అతను వినేలా నాతో ఇంగ్లీష్‌లో మాట్లాడింది.

"మీరు కూర్చోండి. వీడికి పాలు ఇచ్చి మీకు భోజనం రెడీ చేసి పిలుస్తాను. పొద్దుపోయింది. ఇక మీరు బయలుదేరడమే సబబు," అని, అతని భుజం మీద చేయి వేసి వెళ్లిపోయింది.

నేను చాలాసేపటివరకూ అలాగే ఉండి పోయాను.

టైము చూసుకున్నాను. పది.

కాసేపు వెయిట్ చేసి మిగిలిన జిన్ను మొత్తాన్ని గ్లాసులో పోసుకొని కూర్చున్నాను.

పదిన్నర.

ఆమె రాలేదు.

హాల్లో లైట్లు ఆఫ్ అయ్యి బెడ్ ల్యాంప్ వెలగడం కనిపించింది. డోర్ దగ్గరకు వెళ్లి చూస్తే చిన్నూ రూమ్‌లో కూడా లైటు ఆరిపోయి ఉంది. తలుపు దగ్గరగా వేసిన ఆ గదిలో ఆమె చిన్నూను పడుకోబెడుతోందో లేదంటే మత్తుకు ఆమె కూడా పడి నిద్రపోతోందో అర్థం కాలేదు.

మరో పావుగంట చూసి ఇక వెళ్లిపోవడమే మేలని అనుకుంటూ ఉండగా ఆమె మెల్లగా ఏడుస్తూ ముక్కు చీదుకుంటూ వచ్చింది.

"ఏమిటండీ ఏమైంది?" అన్నాను కంగారుగా.

"వెధవకి పిల్స్ ఇచ్చి పడుకోబెట్టి వస్తున్నాను."

"ఆ!"

"అవునండీ.. లేకుంటే వాడు వినడు. నిద్రపోడు. అసలు మీతో ఇంతసేపూ మాట్లాడనివ్వడమే గొప్ప. వాడి పాలల్లో నిద్రమాత్రలు కలిపాను. ఖర్మ. ఏ తల్లికీ ఇంత శిక్ష వద్దు," అందామె పొడికళ్లతో ఏడుస్తూ.

నాకు మతిపోయింది.

"ఊరుకోండి... ఊరుకోండి," అన్నాను యింకే మనాలో తెలియక.

"ఎందుకండీ అలా చేశారు? మనం మళ్లీ కలిసే వాళ్లం కదా?"

"కాదండీ.. ఇవాళ నా మనసులో ఉన్నదంతా చెప్పేయాలి. ఎన్నాళ్ల బరువో ఇది," అందామె.

ఉన్నట్టుండి ఆమె ముఖం గంభీరంగా మారిపో యింది. కుర్చీలో కూర్చుని బాసిం పట్టు వేసుకుంటూ అంది-

"మీకు మళ్లీ మా నాన్న కథ మొదట్నుంచీ చెప్పా లండీ. మంగలి డాక్టర్ కథ కావాలన్నారుగా. చెప్ప మంటారా?" అంది.

"ఇది చిన్నప్పుడు నేను వెలుగులో చూసిన కథ కాదు. కళ్లుపోయి చీకట్లో ఉండగా చూసిన కథ. నా అదృష్టం. ఆ చీకటి నాకు చాలా వెలుగు ఇచ్చింది. నడిచి వచ్చిన నా జీవితాన్నే కాదు, గడిచిపోయిన మా నాన్న జీవితాన్ని కూడా బేరీజు వేసుకోవడానికి అవసరమైన జ్ఞానాన్ని నాకు ప్రసాదించింది. వెలుగులో చూడటానికి నిరాకరించే అనేక సంగతులనుఈ చీకటి నాకు చూపించింది. ఆ విధంగా అది నాకు చాలా మేలు చేసింది. లేకుంటే నాకు మా నాన్న అర్థమయ్యే వాడే కాదు."

నేను ఆసక్తిగా ముందుకు వొంగి కూర్చున్నాను.

ఆమె కథను తిరిగి కొత్తగా ప్రారంభించింది.

"మా తాత బార్బర్ పనితో పాటు మేళగాడుగా కూడా పని చేసేవాడు. అయితే పనిమంతుడు కాదు. అంకె కోసం ఆయనను కూడా కలుపుకుంటే నలుగురి మధ్యా వచ్చీరాని నాదస్వరం ఊదేవాడట. అపస్వరా లతో అందరికీ నవ్వు తెప్పించేవాడట. కాని మా నాన్నకు ఆ అపస్వరాల నాదస్వరమే నచ్చింది. మా తాత దగ్గర మంగలి పని నేర్చుకోవడానికి మొరాయించిన మా నాన్న అదే తాత దగ్గర బలవంతం పెట్టి మరీ నాదస్వరం నేర్చుకున్నాడు.

''అయితే ఆ పని నేర్పించడం మా తాతకు ఇష్టం లేదు. నాదస్వరం ఊదితే గుండెలు ఆర్చుకుపోతాయని ఆయనకు భయం ఉండేదట. కాని మా నాన్న విన లేదు. కష్టపడి మరీ ఇష్టంగా సన్నాయి నేర్చుకున్నాడు. మద్రాసులో సీటు వచ్చి, పెట్టే బేడా సర్దుకొని బయల్దేరు తున్నప్పుడు కూడా మానాన్నతో పాటు తోడుగా వెళ్లింది బిగ్రుగా వస్త్రంలో చుట్టిన నాదస్వరమే. చదువుకునే రోజుల్లో ఆ నాదస్వరం ఆయనకు బోలెడంతమంది ఫ్రెండ్స్‌ని సంపాదించిపెట్టింది.

''ఆయనకు సంగీతం అంటే ఎంత పిచ్చి అంటే మద్రాసులో ఉన్నంత కాలం ఆయన ప్రతి సంవత్సరం తప్పనిసరిగా చేసిన పని తిరువాయూరు త్యాగరాయ ఆరాధనోత్సవాలకు హాజరు కావడం. ఉత్సవాల చివరి రోజున త్యాగరాజస్వామిని పల్లకిలో ఉంచి నాలుగు వీధుల్లోనూ ఊరేగించే ఘట్టాన్ని మాకు ఎప్పుడు వర్ణించి చెప్పినా ఆయనకు పూనకం వచ్చేది. ఆ సమయంలో దక్షిణదేశంలోని గొప్పగొప్ప మేళగాళ్లు అందరూ బృందాలుగా ఏర్పడి అక్కడ నాదస్వరంతో అమృతాన్ని కురిపించేవారట. ఆ అమృతాన్ని ఆయన ఎన్నోసార్లు కడుపునిండా తాగివచ్చానని చెప్పేవాడు.

''ఆ ప్రభావం ఆయనపై నుంచి పోలేదు. మా ఊరికొచ్చి డాక్టరుగా ప్రాక్టీసు పెట్టాక కూడా సంగీతాన్ని మానలేదు. చెవుల్లో నుంచి స్టెత్ తీసి అవతల పడేసి రిలాక్స్ అయినప్పుడల్లా ఆయన పెదాల మీద ఏదో ఒక పాట వినిపిస్తూనే ఉండేది. మూడ్ బాగుంటే చేతుల్లో నాదస్వరం ప్రత్యక్షమయ్యేది. ఆయన పలికించే రాగాలకి ఎప్పుడైనా చదువుకు అంతరాయం కలిగి ఏమిటి నాన్నా నువ్వు అని విసుక్కుంటే ఆయన మాత్రం తేటగా నవ్వుతూ సంగీతం లేకపోతే ఎలా గమ్మా? అనేవాడు.

''అయితే ఆయనకు ఆ సంగీతం ఒక్కటే చాల్లేదు. మిగిలిన దప్పికనంతా ఆయన చెట్లు మొక్కల్లో గడిపి తీర్చుకునేవాడు. మా ఇంటి నిండా ఆయన నాటిన మొక్కలు, పూలతీగలే. ఆ చెట్ల పిచ్చికి ఇల్లు అడవిలాగా తయారయ్యి ఆయనతో పాటు చాకిరీ చేయలేక మేమూ మా అమ్మా ఎప్పుడైనా విసు క్కుంటే ఆయన హాయిగా నవ్వుతూ - చెట్లు లేకుండా ఎలాగమ్మా? అనేవాడు. ఇప్పుడీ మనుషులకి ఈ జబ్బు లన్నీ ఎందుచేత? పచ్చటి చెట్లను తాకకనే అని నన్ను బుజ్జగిస్తూ నా చేయి పట్టుకొని మొక్కల మధ్య నడి పించేవాడు. అలా మా నాన్న జీవితం చెట్లతో మొక్క లతో మనసును సేదతీర్చే సంగీతంతో హాయిగా ప్రశాంతంగా గడిచిపోయింది.

''ఇప్పుడు నేను ఊహించగలను అవి లేకపోయి ఉంటే ఆయన ఏమైపోయుండేవాడో. డాక్టరుగా తనకు కలిగే అసంతృప్తిని ఎలా తట్టుకోలేకపోయేవాడో. బతికి నంత కాలం ఆయనకు అవమానాలు తప్పలేదు. ఆయన తర్వాత మా ఊరికి వచ్చిన కుర్ర డాక్టర్లు అసలా యనను డాక్టరుగానే గుర్తించలేదు. ఎందుకంటే ఆయన ఎంబిబిఎస్ చేయలేదు. రెడ్డి డాక్టర్లు ఏనాడూ తమ సరసన ఆయనకు చోటు ఇవ్వలేదు. ఎందుకంటే ఆయన రెడ్డి కాడు. అదంతా కనిపించని బాధ.

''ఇక కనిపించిన బాధ ఉంది. అది మా అమ్మ. రోజూ సాయంత్రమైతే చాలు స్నానం చేసి, చలువ చేసిన బట్టలు కట్టుకొని మహలక్ష్మిలాగా మా నాన్నతో పాటు తోడుగా హాస్పిటల్‌కు వెళ్లే మా అమ్మ అలా మరికొంత కాలమే తనకు తోడుగా వస్తుందని మా నాన్నకు ముందే తెలుసు. ఆమె జబ్బుకు మా నాన్న మేజిక్ పని చేయ లేదు. ఆయన పత్యాలు పనికిరాలేదు. అయినా ధైర్యం గానే ఆమె ఎడబాటును ఆహ్వానించాడాయన. ఆమె ప్రాణం వదులుతున్నప్పుడు ఆమె పక్కన నిలుచుని ఎంత బాగా నవ్వాడంటే ఆ నవ్వునే దీపాలుగా చేసుకుని కళ్లు మూసిందామె.

''ఆ కష్టకాలంలో కూడా మా నాన్నకు తోడు నిలిచింది మేము కాదు. ఆయన సంగీతమే. ఆయన నీళ్లు పోసి పెంచిన పాదులే. ఆయనకు చివరివరకూ అవే నీడనిచ్చి సేదదీర్చి సాగనంపాయి,'' అని ఆగిం దామె.

ఆ తర్వాత కాసేపటికి అంది-

''మీకు తెలుసాండీ? మెడిసిన్ చేస్తున్నప్పుడు నేను బాగా పాడేదాన్ని. ఇప్పుడు అంతా మర్చిపోయాను. అసలు నా భర్త నాకు మా కల్చరల్ యాక్టివిటీస్‌లోనే పరిచయమయ్యాడు. ఆయనకు మృదంగం తెలుసు. సంగీతం వాళ్ల వంశంలోనే ఉంది. మీరు వినే ఉంటారు పుదూరు ద్రావిడులని వాళ్లు మన ప్రాంతంలో సెటిలర్స్.

''కాని ఆ వంశంలో కళ ఏనాడో అంతరించి పోయింది. ఉద్యోగాలను వేటాడుతూ పొట్టకూటి కోసం వలసలతో దేశాలు తిరుగుతూ నా భర్త కోల్పోయినట్టే వాళ్ల వంశంలో అందరూ బంగారంలాంటి కళకు దూర మయ్యారు. విలువైన కళ. కోట్లు ఖర్చు పెట్టినా ఒకరి శరీరంలో బలవంతంగా ప్రవేశపెట్ట లేని కళ. ఆక్సిజన్ లాంటి కళ...''

ఇప్పుడు గ్లాసు ఆమె రెండు చేతుల్లోనూ నలుగు తోంది.

ఏదో ఆలోచిస్తున్నట్టుగా తల వొంచుకొని నగ్నంగా ఉన్న పాదాలను పదే పదే నేల మీద కదుపుతూ ఉంది.

ఆమె చెప్పాలనుకున్నది ఇంకా చెప్పేయలేదా?

“కాలం మారిపోయిందండీ. ఒకటీ రెండూ అని లెక్కపెట్టడానికి లేదు. అంతా మారిపోయింది. మనుషులే మారిపోయారు. వృత్తులూ మారిపోయాయి. నో నోబెల్ ప్రొఫెషన్స్. గతంలో మనుషులు వాళ్ల వాళ్ల వృత్తుల్లో ఎంతో సంతృప్తి అనుభవించేవారు. అసంతృప్తి ఏదైనా కలిగితే ఆటపాటలతో కళలతో ఆత్మీయమైన అనుబంధాలతో పూడ్చుకుని హాయిగా బతికేవారు. మరి ఇవాళ?

”ప్రాణం ఉసూరుమంటోందండీ ఈ సొసైటీని చూస్తే. ఈ స్పీడు మంచికి కాదు. నాకు ఏ హాని జరగబోతోందో కళ్లు పోయేదాకా నేను తెలుసుకోనట్టే ఈ సొసైటీ కూడా తనకు ఏ హాని జరగబోతోందో తెలుసుకోవడం లేదు. ఇప్పుడు ఎవరికీ విలువలేదు. గౌరవం లేదు. మర్యాదతో కూడిన ఐడెంటిటీ లేదు. డబ్బు కోసం అన్నిట్లో అందరూ కరప్ట్ అయిపోయారు. ఆ సంగతి సొసైటీకి తెలుసు. అందుకే అది తనను తాను గౌరవించుకోవడం లేదు.

“డబ్బు.. డబ్బు... ఇప్పుడు డబ్బొక్కటే విలువ. కాని విషాదం చూశారా? ఒక లెవల్ డబ్బున్న వాళ్లకు ఇంకో లెవల్ డబ్బున్న వాళ్లంటే విలువ లేదు. అంతెందుకు? ఖరీదైన సెల్‌ఫోన్ ఉన్నవాడికి నాసిరకం సెల్‌ఫోన్ ఉన్నవాడంటే విలువలేదు. నాసిరకం ఉన్నవాడికి అసలు సెల్‌ఫోన్ లేనివాడంటేనే విలువలేదు. ఏ మెట్టు మీదనూ ఇప్పుడు మనిషికి తృప్తిలేదు. అతడికి సంతృప్తిని ఇచ్చే వృత్తి లేదు. అసంతృప్తి కలిగితే పూడ్చుకోవడానికి కళ లేదు. కాసింత సేద తీరడానికి మానవ సంబంధాలూ లేవు.

“నిన్న మొన్నటి దాకా నేను చాలా బాధపడేదాన్ని. నా భర్త తరపున బంధువులు మమ్మల్ని బాయ్‌కాట్ చేయడం వల్ల అసలు రిలేషన్సే లేకుండా పోయాయని అనుకునేదాన్ని. అదంతా ట్రాష్. ఇప్పుడు ఎవరి దగ్గరా ఎవరికోసమనీ టైము లేదు. మంచాన పడుంటే మా అక్కే నన్ను చూడ్డానికి వీలు చూసుకొని మరీ వచ్చింది. అందరి పరిస్థితి ఇదే. అందుకే ఈ ఫ్రస్టేషన్స్. ఈ రోగాలు, ఈ గుండెపోట్లు, డాక్టర్ల చుట్టూ తిరగడాలు.

“ఇప్పుడే ఈ లోకం ఇలా ఉంటే ఇక మావాడు పెరిగి పెద్దయ్యేనాటికి పరిస్థితి ఏమిటి అని నా భయం.

“ఇప్పటికే వాడు ఒంటరి. మాతృభాష రాదు. కనుక ఈ దేశంలో వాడు పర్మినెంట్‌గా మైనారిటీ. వాడి కోసం మేము ఒక చెల్లినో తమ్ముణ్ణో కనకుండా ఆగిపోయాం. కనుక వాడి ఎమోషన్స్‌ను కనీసం షేర్ చేసుకునేవాళ్లు, అండగా నిలిచేవాళ్లు ఉండరు. స్ట్రాంగ్ ఫ్రెండ్‌షిప్స్‌ని అలా చేసే చదువును వాడు చదవడం లేదు. అసలు అలాంటి పరిస్థితి ఇవాల్టి స్కూళ్లలో లేదు. ఇక మీరూ నేనూ చూసిన సాదాసీదా జీవితాన్నయితే వాడు చూడలేదు సరికదా కల్లో అయినా ఊహించలేడు. కనుక ఈ దేశం గ్రౌండ్ రియాలిటీ వాడికి ఎప్పటికీ అర్థం కాదు. ఆ గ్యాప్ ఒకటి. ఇక వాడు ఎలా బతుకుతాడు? ఇప్పుడే వాడు తల్లిని అనుమానిస్తున్నాడు. తీరా తేలేదేమంటే రేపు పెద్దయ్యాక వాడు సైకోగా మారబోతున్నాడని. ఎలా ఊహించేది... నా బిడ్డ... నా బంగారు తండ్రి...”

ఆమె ముఖం మారిపోయింది. దుఃఖంతో ముఖాన ముడతలు పడ్డాయి.

“అందుకే నా తాపత్రయం. డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా మూసపోసే చదువు వాడికి వద్దు. వాడు తెచ్చుకుంటున్న ర్యాంకులు వాడికి మేలు చేయవు. వాటికి ఇప్పుడే విలువలేదు. భవిష్యత్తులో అసలే ఉండదు. రాబోయే రోజుల్లో ఏదైనా విలువంటూ మిగిలితే అది సృజనాత్మకమైన కళకే. మూస ఐడెంటిటీల వల్ల క్రైసిస్‌తో సతమతమైపోయే వాళ్ల మధ్య వాణ్ణి కాస్తంత భిన్నంగా నిలబెట్టేది కళే. ఆ కళే మావాడికి కావాలి. వాడిలోని కళ నలుగురికీ తెలియకపోయినా పర్వాలేదు. వాడికి తెలిస్తే చాలు. వాడి చేయి పట్టుకుని నడిపిస్తే చాలు. కన్నీళ్లు వచ్చినప్పుడు వాణ్ణి ఓదారిస్తే చాలు. జీవితాంతం వాడికి తోడుంటే చాలు.

“ఇది మనుషుల్ని బైరాగులని మారుస్తున్న సొసైటీ అండీ. బైరాగులు వొంటరివాళ్లు. కాని వాళ్లకు తోడుగా పాట ఉంటుంది. అందుకే వాళ్లు బతగ్గలరు. అలాగే మావాడికి కూడా పాట తోడుండాలని నా కోరిక. ఇందాక మీరన్నారే... మీ అయ్యప్ప ఒంట్లో సంగీతం ఉందని. మావాడి ఒంట్లో కూడా సంగీతం ఉందండీ. వాడి జీన్స్‌లోనే ఉంది. మా చేతులారా మేమే అది మూగబోయేలా చేశాం. మా పరుగులో వాణ్ణి నిర్లక్ష్యం చేసి...” ఉన్నట్టుండి ఆమె పెద్దగా ఏడ్చింది.

“ఊరుకోండి ఊరుకోండి,” అన్నాను మెల్లగా.

అప్పటికే ఆమె వశం తప్పింది. టీపాయ్ మీదున్న బాటిల్‌ని చేత్తో తోసేయబోయింది. గట్టిగా పట్టు

కున్నాను.

ఆమె ఏడుపు ఆపలేదు.

"అలసిపోయానండీ... చాలా అలసిపోయాను," అంది గొంతు నొక్కి పడుతున్నట్టుగా.

కాసేపటికి అలాగే నిద్రపోయింది.

నేను నెమ్మదిగా ఆమెను కుర్చీలో కూర్చోపెట్టి మెల్లగా గది నుంచి బయటకు వచ్చాను.

హాల్లో టీవీ ఎదురుగా చాప పరుచుకొని పనమ్మాయి నిద్రపోతూ ఉంది.

బహుశా పక్క గదిలో చిన్నూ మత్తులో గాఢనిద్రపోతుండాలి.

కాసేపు అలాగే నిలుచున్నాను.

నా కోసం సిద్ధం చేసిన భోజనం ఇక్కడే ఎక్కడో ఉంటుంది. తినాలనిపించలేదు. ఆకలి ఎగిరిపోయింది.

నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ ఇంటి నుంచి బయటపడి మెట్లన్నీ దిగి రోడ్డుమీదకు వచ్చాను.

వాన వెలిసింది.

ఇది జరిగిన  రెండు మూడు వారాల్లో ఆమె రెండు మూడుసార్లు ఫోన్ చేసింది. వాళ్ల అబ్బాయిని మ్యూజిక్‌లో చేర్పించడం కోసం చేస్తున్న ప్రయత్నాలన్నీ నాతో చెప్పింది. టీవీలో అక్కడా ఇక్కడా కనిపించే రామాచారి దగ్గరకు తీసుకువెళ్లిందట. శోభారాజు వాళ్ల స్కూలుకు కూడా తీసుకు వెళ్లిందట. ఇంకా ఎవరివో కొన్ని పేర్లు చెప్పింది. చిన్నూ ఎవరికీ రెస్పాండ్ కావడం లేదట.

"నాలో కన్నీళ్లు ఇంకిపోయినట్టు వాడిలో కళ ఇంకిపోయినట్టుందండీ," అందామె దిగాలుగా.

మళ్లీ ఆమె నుంచి ఫోన్ లేదు .

వేసవికాలం వచ్చింది. సముద్రం పొర్లి రావడం వల్ల ఫిబ్రవరిలోనే రోళ్లు పగిలే ఎండలను  మోసుకొచ్చింది.

మార్చి ఏప్రిల్ నాటికి ఎండ దెబ్బకు జనం అల్లల్లాడుతూ ఉండగా చల్లటి జల్లు కురిపించే వేసవి వానలా ఆమె దగ్గరి నుంచి ఫోన్ వచ్చింది. గొంతు వినడంతోటే చాలా సంతోషంగా ఉందని అర్థమైపోయింది.

"ఏమిటి సంగతి?" అన్నాను నవ్వుతూ.

"మీరు మా ఇంటికి ఒకసారి రావాలండీ," అందామె ఉద్వేగంగా.

"దేనికి?"

"చెప్తే చాలదు. మీరు చూడాలి. ఇప్పుడు మా వాడు ఇంటినో చిన్న సైజు జంగిల్ చేసి పెట్టాడండీ. ఆటపాటలు ఏమైనా నేర్చుకుంటాడు కదా అని సమ్మర్ స్కూల్లో జాయిన్ చేస్తే.. వాళ్లేదో నర్సరీకి తీసుకువెళ్లారట పిక్నిక్‌కి. ఏ కళన ఉన్నాడో ఏమో వస్తూ వస్తూ నాలుగు బంతిపూల మొక్కలను కొనుక్కుని వచ్చాడు. వాటిని నా చేతే కుండీల్లో పెట్టించాడు. ఇప్పుడు వాటితో మాట్లాడటం స్టార్ట్ చేశాడు."

"ఏమిటీ?"

"అవునండీ.. నేను గమనిస్తే సిగ్గుపడి ఆపేస్తున్నాడు కానీ వాడు రోజూ వాటితో బోలెడంత మాట్లాడుతున్నాడు. మొక్కలతో మాట్లాడితే అవి త్వరగా ఎదుగుతాయ్ అని ఎవరో చెప్పారట. అంతేనా? రోజూ నాచేత రకరకాల పూల మొక్కలు కొనిపిస్తున్నాడు. వాటికి తనే దగ్గరుండి నీళ్లు పోస్తున్నాడు. ఆ పూలను తాకి మురిసిపోతున్నాడు. ఆకులతో కబుర్లు చెబుతున్నాడు. నాకెంత సంతోషంగా ఉందో వాడలా ప్లాంట్స్‌తో ఫ్రెండ్‌షిప్ చేస్తుంటే. అలా గొంతు విప్పి మాట్లాడుతూంటే. అన్నింటికి మించి వాడికి నా మీద అటెన్షన్ కూడా బాగా తగ్గింది.

"మొన్నొక రోజు ఇలాగే మొక్కలు కొంటుంటే 'మనింట్లో ఎలాగమ్మా? ఎక్కడ పెట్టుకోవడం,' అన్నాడు చిన్నబుచ్చుకుంటూ. ఎందుకనో నాకు మా నాన్న గుర్తొచ్చాడు. చూస్తాను చూస్తాను... కాస్త చెట్లు, మొక్కలు ఉన్న మంచి ఇల్లు దొరికితే మా ఫ్లాట్ అద్దెకిచ్చి మారిపోతాను. పైన బతికితే లాభం లేదండీ. కింద బతికితేనే సుఖం. కాస్త నేల మట్టీ చెట్టూ చేమ తగిలితే మావాడు ఇంకా దారిలో పడతాడు. దిగులుండదు..." ఉత్సాహంగా సంతోషంగా ఆమె మాట్లాడుతూనే ఉంది.

కన్నీళ్లు ఇంకిపోయి తడి ఆరిపోయిన ఈ కథలో కాసింత మట్టి చెమ్మను చీల్చుకుని పచ్చటి మొక్కలు తలెత్తుతున్న దృశ్యం నా కంటికి కనిపిస్తూ ఉంది.

ఇది ఆరంభం కావచ్చు.

*తెలుగునాడి (అమెరికా తెలుగు పత్రిక), జూన్-జులై 2005*
*చూపు ప్రచురణ, జూన్ 2005*

